



# విజయభాను







విశాఖపట్నం, ఆదివారం 11-08-2019 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 42 సంచిక : 289 పేజీలు : 8 వెల : 1 రూపాయి


### నూతన ఆవిష్కరణలకు వర్శిటీలు

## దిశానిర్దేశం చేయాలి

- అధ్యాపకులు నిత్య విద్యార్థులే
- పరిశోధకులను ఆర్థికంగా ప్రోత్సహించాలి
- భారత దేశం ఎందరో శాస్త్రవేత్తలకు పుట్టినిల్లు
- భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి గీతం ఫౌండేషన్ అవార్డు అందజేత





విశాఖపట్నం : భారత దేశంలో పట్టణీకరణ, తాగునీటి సమస్యలు, వాతావరణ మార్పులు, ప్రత్యామ్నాయ ఇందన వనరులు, పారిశుద్యం వంటి సమస్యలకు సరికొత్త పరిష్కారాలను గుర్తించాల్సి ఉందని ముఖ్యంగా నూతన ఆవిష్కరణలు దేశంలోని విశ్వ విద్యాలయాలను నుంచి ప్రారంభం కావాలని భారత మాజీ రాష్ట్రపతి, భారత రత్న అవార్డు గ్రహీత ప్రణబ్ ముఖర్జీ పిలుపు నిచ్చారు. శనివారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 39వ వ్యవస్థాపక ధినోత్సవానికి ముఖ్య అతిధిగా హజరై ఆయన గీతం ఫౌండేషన్ ధార్మికోపన్యాసం చేశారు. దేశ ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచడంలో పరిశోధన, నూతన ఆవిష్కరణలు ఎంతో దోహదం చేస్తాయని, దేశ భవిష్యత్తుని నిర్ధేశిస్తాయని ఆయన పేర్కొన్నారు.

యునెస్కో అద్యయనం ప్రకారం భారత దేశంలో మిలియన్ జనాభాలో 156 మంది పరిశోధకులు మాత్రమే ఉన్నారని ఆయన తెలిపారు. అయితే జపాన్, అమెరికా, చైనా దేశాలతో పోల్చితే భారతదేశంలో పరిశోధన, అభివృద్ధికి కేటాయిస్తున్న మొత్తాలు స్థూలజాతీయోత్పత్తిలో 0.8 శాతం కూడా లేవని ఆయన విచారం వ్యక్తం చేశారు. దేశంలోని విశ్వవిద్యాలయాలు, కేంద్ర పరిశోధనా సంస్థలను మరింతగా బలోపేతం చేసుకోవాల్సి తరువాయి 2లో..

## పెట్టుబడులను ఆకర్షించాలి

- ఏ శంకుస్థాపన రాయినీ వదిలిపెట్టేదిలేదు
- పారిశ్రామిక ప్రగతికి కృషి చేస్తున్న సంస్థలకు కృతజ్ఞతలు
- ఏపీ ముఖ్యమంత్రి జగన్



అమరావతి : ఏ శంకుస్థాపన రాయి కూడా పరిశ్రమగా మెరవకుండా వదిలిపెట్టే ప్రసక్తేలేదని తమ ప్రభుత్వం నిజాయితీగా, చిత్తశుద్ధితో స్పష్టం చేసిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ట్విటర్ వేదికగా ఆయన స్పందించారు. ఏపీలో పారిశ్రామిక ప్రగతికోసం చేస్తున్న కృషికి సహకరిస్తున్న విదేశీ వ్యవహారాల శాఖకు, డిప్లొమాటిక్ ఔట్‌రీచ్ సదస్సులో తరువాయి 2లో..

## శ్రీశైలంలో 10 గేట్లు ఎత్తివేత



కర్నూలు: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు శ్రీశైలం జలాశయానికి వరద నీరు పోటెత్తుతోంది. భారీగా వరద ప్రవాహం ఉండటంతో అధికారులు మొత్తం 12 గేట్లకు గానూ 10 గేట్లను ఎత్తి దాదాపు 2,43,171 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న నాగార్జున సాగర్‌కు వదులుతున్నారు. ఒక్కోగేటును 10 మీటర్ల మేర ఎత్తినట్లు అధికారులు తెలిపారు. మొత్తం 4.04లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు వారు తెలిపారు. శ్రీశైలం జలాశయ పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 882.70 అడుగులు నమోదైంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.81 తరువాయి 2లో..

### తర్కించి విభేదించకపోతే ప్రజాస్వామ్యానికి అర్థం లేదు



- జాతిపితను గౌరవించుకోలేని స్థితికి దిగజారాం
- మత రాజకీయాలపై కేటీఆర్ విమర్శలు

హైదరాబాద్: దేశంలో ప్రత్యేక పరిస్థితులు నెలకొన్నాయని.. తర్కించి విభేదించే పరిస్థితి లేకపోతే ప్రజాస్వామ్యానికి అర్థం లేదని తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యాఖ్యానించారు. నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయంలో తెలంగాణ తరువాయి 2లో..

## 100 ఆవుల మృతి

- దాణాపై అనుమానం
- గోవుల మృతిపై విచారణ జరిపిస్తాం
- మంత్రి మోపిదేవి వెంకటరమణ



కొత్తూరు: విజయవాడ శివారులోని కొత్తూరు తాడేపల్లి గోశాలలో 100 ఆవులు మృతి చెందాయి. మరో కొన్ని ఆవులు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాయి. శుక్రవారం రాత్రి ఆవులకు పెట్టిన దాణాపై నిర్వాహకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు సంఘటన స్థలికి చేరుకున్నారు. ఇంత పెద్దమొత్తంలో ఆవులు మృతి చెందడంతో వీటికి పోస్టుమార్టం చేయాలని నిర్ణయించారు. అనంతరం గోవుల మృతికి కారణాలు వెల్లడిస్తామని తరువాయి 2లో..

## దొంగతనం చేసి డబ్బు పోయిందని ఫిర్యాదు

### ముద్దాయినుంచిరూ. 20 లక్షలు స్వాధీనం

### నగర పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్ మీనా



విశాఖ క్రైం: తాను పని చేస్తున్న కంపెనీలోని డబ్బు రూ. 20 లక్షల సొత్తు దొంగిలించి తన వద్ద నుంచి ఆ ధనాన్ని దొంగలు ఎత్తుకుపోయినట్టు విశాఖపట్నం పోలీసులకు తరువాయి 2లో..






### ఆయిల్ ట్యాంకర్ పేలి 62మంది మృతి!

మొరగొరో: టాంజానియాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. టాంజానియా రాజధాని దార్ ఎస్ సలామ్‌కు పశ్చిమంగా వున్న మొరగొరోలో ఆయిల్ ట్యాంకర్ పేలడంతో 62 మంది దుర్మరణం చెందారు. ఈ ప్రమాదంలో 70 మందికి గాయాలయ్యాయి. ప్రమాదానికి గురైన ట్యాంకర్ నుంచి స్థానికులు పెట్రోల్ తీసుకెళ్లేందుకు చేసిన ప్రయత్నంలో ఈ ఘోరం చోటుచేసుకున్నట్టు పోలీసులు వెల్లడించారు. ఒక్కసారిగా పేలుడు సంభవించడంతో అక్కడున్నవారు మంటల్లో కాలిపోతూ ఆర్తనాదాలు చేశారు. సిగరెట్ అంటించడం వల్లే ఘోరం!

ఆయిల్ కోసం వచ్చిన ఓ వ్యక్తి సిగరెట్ అంటించడంతో ఈ ఘోరం చోటుచేసుకున్నట్టు సమాచారం. తరువాయి 2లో..




# ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేస్తాం




తాడేపల్లి : త్వరలోనే ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తామని విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. శనివారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆదిమూలపు సురేష్ పాల్గొన్నారు.

సమీక్ష అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రైమరీ స్కూళ్లలో మౌలిక సదుపాయాలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారని తెలిపారు. మండలానికి ఒక పాఠశాలను ముందుగా ఆధునీకరిస్తామన్నారు. విద్యార్థుల రేషియోను బట్టి ఉపాధ్యాయులను నియమించేందుకు వీలుగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. యునిసెఫ్ ఆధ్వర్యంలో కేరియర్ కౌన్సిల్ పోర్టల్ యాప్‌ను స్కూళ్లకు అనుసంధానం చేశామని చెప్పారు.

# ఆధునిక భారతంలో అధునాతన పార్లమెంట్ నిర్మాణం!

ఢిల్లీ: నూతన పార్లమెంటు భవనాన్ని నిర్మించాలన్న ఆలోచన ఉందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. ప్రస్తుత అవసరాలకు తగినట్టు ఆధునిక భవనం అవసరం ఉందని ఆయన వెల్లడించారు.

లేదా ప్రస్తుత భవన సముదాయాన్నే విస్తరించి, సుందరీకరించే అంశాన్ని పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. ఇందుకోసం పార్లమెంటేరియన్స్, ప్రజల నుంచి సలహాలు స్వీకరించేందుకు కొన్ని కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. భారత్‌కు స్వాతంత్రం సిద్ధించి 75 వసంతాలు పూర్తైన సందర్భంగా చేసిన సరికొత్త భారత్ ప్రతిపాదనలో పార్లమెంటు భవన ఆధునీకీకరణ, విస్తరణ చేపట్టాలని ప్రధాని నరేంద్రమోదీని ఓం బిర్లా కోరారు.

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యానికి నిలయమైన భారత పార్లమెంటు అధునాతనంగా, ఆకర్షణీయంగా ఉండాలని ఓం బిర్లా అభిలషించారు. అది మనందరి కలల ప్రతిరూపమని వర్ణించారు. ఈ మధ్యే ముగిసిన లోక్‌సభ సమావేశాలు ఒక్కసారీ వాయిదా పడలేదని ఆయన వెల్లడించారు. ఈ పార్లమెంటు సెషన్‌లో లోక్‌సభను ఒక్కసారీ వాయిదా వేయలేదు. ఫలితంగా కేటాయించిన దానికన్నా 72 గంటలు అదనంగా సభ నడిచింది.

ఇది 12 సమావేశాలకు (సిట్టింగులు) సమానం. లోక్‌సభలో చర్చలు సవ్యంగా సాగితే, సభ్యులు ఎక్కువ సమయం కూర్చోవడం అంటే దేశానికి సానుకూల సందేశం పంపించడం అన్నమాట అని స్పీకర్ ఓం బిర్లా తెలిపారు.

# జిల్లా ప్రతిష్టను ఇనుమడింప చేయాలి


**- రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి ధర్మాన కృష్ణ దాస్**



శ్రీకాకుళం : సిఎం కప్ వాలీబాల్ టోర్నమెంట్ లో జిల్లా ప్రతిష్టను ఇనుమడింప చేయాలని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి ధర్మాన కృష్ణ దాస్ క్రీడాకారులకు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న సిఎం కప్ వాలీ బాల్ టోర్నమెంట్ కోచింగ్ క్యాంపును మంత్రి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ టోర్నమెంటు ఈ నెల 20 నుండి 22 వరకు 3 రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఇందులో 13 జిల్లాల క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు. ప్రస్తుతం ట్రైలర్ కమ్ సెలెక్షన్ జరుగుతుందని అన్నారు. ఈ క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు జిల్లా ప్రతిష్టను పెంపొందించేలా క్రమశిక్షణ, పట్టుదలతో ఆడాలని సూచించారు. క్రీడాకారులకు శిక్షణతో పాటు మంచి భోజన, వసతి సదుపాయాలను కల్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

తొలుత క్రీడలను పర్యవేక్షించి, క్రీడాకారులు విజయం సాధించేందుకు కావల్సిసిన మెళుకువలను స్వయంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సెట్ శ్రీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.వి.ఆర్.ఎస్.మూర్తి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు పి.సుందర రావు, వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి.పోలినాయుడు, కార్యదర్శి కె.రామచంద్రరావు, ఖజనాధికారి పి.రమణ, పి.ఈ.టి అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వి.రమణ, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# 12న మరో అల్పపీడనం!



విశాఖపట్నం: ఈనెల 12 నాటికి వాయువ్య బంగాళాఖాతం, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడేందుకు అనువైన వాతావరణం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈమధ్యే అక్కడ ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారి..ఆ తర్వాత తీరందాటి క్రమంగా బలహీన పడింది. ప్రస్తుతం అది వాయుగుండంగా పశ్చిమ మధ్యప్రదేశ్, తూర్పు రాజస్థాన్ మీదుగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇది మరింత బలహీనపడే అవకాశం ఉందని తెలిపారు.

# ఎయిర్ పోర్ట్ సి.ఐ గా జె. మురళీ



కంచరపాలెం : ఎయిర్ పోర్ట్ సి.ఐ గా జె .మురళీ శనివారం ఉదయం బాద్యతలు స్వీకరించారు. ఈమేరకు ఆర్ .అండ్ .బి కూడలి వద్ద నున్న ఎయిర్ పోర్ట్ పోలీస్ స్టేషన్ లో బాద్యతలు స్వీకరించిన ఆయనకు స్టేషన్ ఎస్ .ఐ లు సిబ్బంది పుష్ప గుచ్చాలు అందజేసి అబినందనలు తెలిపారు . ఈసందర్భంగా ఆయన మాట్లడుతూ వివిద కేసులకు సంబందించి స్టేషన్ కు వస్తున్న పిర్యాదు దారులతో స్నేహ బావంతో మెలగలని సూచించారు . స్టేషన్ లో సిబ్బంది వలన సమస్యలు ఎదుర్కుంటే నేరుగా తనదృష్టికి తీసుకురావాలని కోరారు. అంతకుముందు స్టేషన్ కు చేరుకున్న ఆయన సిబ్బందితో సమీక్షించారు . పెండింగ్ కేసుల పై ఆరా తీశారు .

కాగ 1998 బ్యాచ్ కు చెందిన ఆయన పెందుర్తి , గజువాక తదితర ప్రాంతల్లో విదులు నిర్వహించారు . ఎన్నికల సమయంలో శ్రీకాకుళం జిల్లా నర్సన్న పేట పని చేసిన ఆయన అనంతరం వి . ఆర్ లో ఉన్నారు . ప్రస్తుతం ఎయిర్ పోర్ట్ సి.ఐ గా బదిలీ చేస్తూ అదికారులు ఉతర్వులు జారీ చేశారు .

# బిగ్‌బాస్-3పై ఏపీ హైకోర్టులో పిల్ దాఖలు




అమరావతి: ఓ టీవీ ఛానల్లో ప్రసారమవుతున్న బిగ్‌బాస్-3 రియాల్టీ షో కార్యక్రమంపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ ఏపీ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. అశ్లీలత, అసభ్యత, హింసను ప్రోత్సహించేదిగా ఆ షో ఉందని పేర్కొంటూ తెలుగు యువశక్తి అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. కార్యక్రమాన్ని సెన్సార్ చేయకుండా ప్రసారం చేయడం వల్ల యువత, చిన్నారులపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి అభ్యర్థులను ఎంపిక చేసే ప్రక్రియలో జరిగిన వేధింపులపై ఇద్దరు యువతులు హైదరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఈ అంశాల్ని పరిగణనలోకి తీసుకుని బిగ్‌బాస్ 3 ప్రసారాన్ని నిలువరించేలా ఆదేశించాలని కోరారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి, సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, ఫిల్మ్ సర్టిఫికేషన్ సెంట్రల్ బోర్డు ఛైర్‌పర్సన్, ఇండియన్ బ్రాడ్ కాస్టింగ్ ఫౌండేషన్, స్టార్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తదితరులను వ్యాజ్యంలో ప్రతివాదులుగా పేర్కొన్నారు.

**మొదటి పేజీ తరువాయి**

## పెట్టుబడులను ఆకర్షించాలి

పాల్గొన్న ప్రతిఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కాగా పలు కీలక రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా శుక్రవారం డిప్లొమాటిక్ ఔట్‌రీచ్ పేరిట ఓ సదస్సు జరిగిన సంగతి తెలిసిందే. ఈ సదస్సులో యూఎస్ఏ, యూకే, జపాన్, కెనడా, కొరియా, సింగపూర్, ఆస్ట్రియా, పోలాండ్, ఆస్ట్రేలియా, టర్కీ తదితర 35 దేశాల రాయబారులు, హైకమిషనర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పరస్పరం ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను పెంపొందించుకునే దిశగా పలు ఒప్పందాలు కుదుర్చుకోవటమే లక్ష్యంగా ఈ సదస్సు జరిగింది.

## శ్రీశైలంలో 10 గేట్లు ఎత్తివేత

టీఎంసీలు ఉండగా.. ప్రస్తుతం 202.96 టీఎంసీలకు నీటి నిల్వ పైగా ఉంది. ఎడమగట్టు విద్యుత్ కేంద్రం ద్వారా 42,378 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం ద్వారా 31,059 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా 800క్యూసెక్కులు, హంద్రీనీవాకు 2,025 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యూలేటరీ ద్వారా 28,000 క్యూసెక్కులు, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 735 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. మరోవైపు నాగార్జున సాగర్ జలాశయానికి కూడా వరద కొనసాగుతోంది. ఇన్‌ఫ్లో 1.02లక్షల క్యూసెక్కులు ఉండగా.. ఔట్‌ఫ్లో 6,051 క్యూసెక్కులు ఉంది. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకుగానూ.. ప్రస్తుతం 520.90 అడుగుల నీటిమట్టం నమోదైంది. జలాశయం పూర్తి సామర్థ్యం 312.05 టీఎంసీలుకాగా.. ప్రస్తుతం 150.92 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

## 100 ఆవుల మృతి

పోలీసులు చెబుతున్నారు. మరోవైపు గోశాల నిర్వాహకులకు ఎవరితోనైనా గొడవలు ఉన్నాయా? ఆ కక్షతోనే విరోధులు ఇలాంటి చర్యకు పూనుకొన్నారా? అనే దిశలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

***గోవుల మృతిపై విచారణ జరిపిస్తాం: మంత్రి మోపిదేవి వెంకటరమణ***

నగర శివారులోని కొత్తూరుతాడేపల్లి గోశాలలోని గోవుల మృతిపై శాఖపరంగా విచారణ జరిపిస్తామని పశు సంవర్థక శాఖ మంత్రి మోపిదేవి వెంకటరమణ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భారీ సంఖ్యలో గోవులు మృతి చెందడం బాధాకరమన్నారు. విచారణ నివేదిక రాగానే గోవుల మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అన్ని గోశాలల్లో ఉన్న గోవుల పరిస్థితిపై తనిఖీలు చేపడతామని చెప్పారు. గోవుల మృతి వెనుక కుట్ర కోణం ఏమైనా ఉందా..? అని కూడా విచారిస్తామన్నారు.

***గోవుల మృతి బాధాకరం : మల్లాది విష్ణు***

గోశాలలో పెద్ద సంఖ్యలో గోవులు మృతి చెందటం బాధాకరమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు వ్యాఖ్యానించారు. శనివారం ఆయన కొత్తూరుతాడేపల్లి గోశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ.. గోవుల మృతిపై సమగ్ర విచారణ జరిపిస్తామన్నారు. ఇక మీదట గోశాలలపై పశుసంవర్ధక శాఖ అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండేలా చూస్తామని హామీ ఇచ్చారు.

కాగా విజయవాడ నగర శివారులోని కొత్తూరు తాడేపల్లి గోశాలలో 100 గోవులు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గోవుల మరణ మృదంగం కొనసాగుతోంది. గోవుల మృతి సంఖ్య 101కి చేరగా మరో 20 గోవుల పరిస్థితి విషమంగా ఉంది. శుక్రవారం గోశాలకు వచ్చిన 22 టన్నుల పసుగ్రాసం మీదే నిర్వాహకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విషపూరితమైన లేత జున్నుగడ్డి తినటం వల్లే ఘోరం జరిగి ఉండవచ్చునని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మృతి చెందిన పెద్ద గోవులకు పశు వైద్యులు పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తర్వాతే గోవుల మృతికి సరైన కారణాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## తర్కించి విభేదించకపోతే ప్రజాస్వామ్యానికి అర్థం లేదు

వికాస సమితి మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మత రాజకీయాలపై విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం ఒక మతాన్ని వ్యతిరేకించడం లేదా అతిగా ప్రాధాన్యం ఇవ్వడం సరికాదన్నారు. జాతిపితను గౌరవించుకోలేని పరిస్థితికి దేశం దిగజారిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణలో తరతరాలుగా మత భేదం లేకుండా జీవనం కొనసాగుతోందన్నారు. నాతో ఉంటే దేశ భక్తుడివి లేకపోతే దేశ ద్రోహివి అన్న పరిస్థితులు దేశంలో నెలకొన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఉదాత్తమైన ఆశయంతో తెలంగాణ వికాస సమితి ఏర్పడిందని కేటీఆర్ తెలిపారు. నాథురామ్ గాడ్సే దేశభక్తుడంటూ సాధ్వీ ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ చేసిన వ్యాఖ్యల్ని తాను సోషల్ మీడియాలో ఖండించినట్టు ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. ఆ సమయంలో ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ చేసిన వ్యాఖ్యల్ని సమర్థిస్తూ తనకు ట్విటర్‌లో కామెంట్ రావడం ఎంతో బాధ కలిగిందని కేటీఆర్ చెప్పారు.

## దొంగతనం చేసి డబ్బు పోయిందని ఫిర్యాదు

శ్రీనివాసరావు ఫిర్యాదు చేశాడు. సదరు వ్యక్తి గాజువాక ప్రాంతంలోని ఓ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. డ్యూటీ నిమిత్తం తాను రూ. 20 లక్షల రూపాయలు నగదు తీసుకువస్తుండగా దారి కాచి దుండగులు తన వద్ద నుంచి ఆ సొమ్మును దోచుకుని పారిపోయినట్టు విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చోరీకి సంబంధించిన విషయాలను తెలుసుకున్న నగర పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్ మీనా రంగంలోకి దిగి విషయసేకరణ ప్రారంభించారు. శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుకు, అతని విచారణలో వెలుగు చూసిన నిజాలకు పొంతన లేకపోవడంతో ముందుగా అతనినే అనుమానించారు. దీనిపై విచారణ చేపట్టగా తుదకు శ్రీనివాసరావే నగదును అపహరించినట్టు ఒప్పుకున్నాడు. తన కుటుంబం ఆర్థికంగా చితికిపోవడం, తాను మద్యానికి బానిస కావడం ఇందుకు ప్రధాన కారణాలని ఒప్పుకున్నాడు. నిందితుడిపై పలు సెక్షన్‌ల ప్రకారం 394, 409, 420, 189 కింద కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ మీడియా సమావేశంలో పోలీసు అధికారులు ఉదయ్ భాస్కర్ , సురేష్ బాబు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ ట్యాంకర్ పేలి 62మంది మృతి!

టాంజానియా ఆర్థిక రాజధాని దార్ ఎస్ సలామ్‌లోని మొరోగోరో ప్రాంతంలో శనివారం ఓ చమురు ట్యాంకర్ బోల్తా పడింది. దీంతో అందులోని ఆయిల్ రోడ్డుపై ప్రవహించింది. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు చమురు నింపుకొనేందుకు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు. ఇంతలో ఓ వ్యక్తి సిగరెట్ అంటించడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి ట్యాంకర్‌లో పేలుడు సంభవించింది. దీంతో అక్కడున్న వారంతా సజీవ దహనమయ్యారు.

గతంలోనూ ఇలాంటి ఘటనలు!

ఇప్పటివరకు 62 మంది మృతదేహాలను గుర్తించామని అధికారులు తెలిపారు. వీరిలో చాలా మంది స్థానికంగా ట్యాక్సీలు నడుపుకునేవారే. ఆఫ్రికా దేశాల్లో ఇలాంటి ఘటనలు జరగడం సాధారణంగా మారాయి. 2013లోనూ టాంజానియాలో జరిగిన ఇదే తరహా ఘటనలో 29 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఏడాది మే నెలలో నైగర్ దేశంలో ఓ చమురు ట్యాంకర్ బోల్తా పడింది. అందులోని చమురు తీసుకోవడానికి వెళ్లగా అది పేలి 80 మంది సజీవదహనమయ్యారు. గతేడాది మార్చిలో పాకిస్థాన్‌లోని పంజాబ్‌లో ఇలాంటి ఘోరం జరిగి 150 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.

# ఆగస్టు 15 తర్వాత టీమిండియా కోచ్ ఎంపిక?




ఢిల్లీ: టీమిండియా ప్రధాన కోచ్ ఎంపిక ఆలస్యం కావొచ్చని తెలుస్తోంది. భారత జట్టు కోచ్ పదవికి దరఖాస్తు చేసిన అందరినీ వడబోసి సుమారు ఆరు మందిని ఇంటర్వ్యూకు ఎంపిక చేశారని సమాచారం. అయితే ఈ ఇంటర్వ్యూలు ఆగస్టు 13, 14వ తేదీల్లో జరగాలి. కానీ పేపర్ వర్క్ ఇంకా మిగిలి ఉండటంతో ఆగస్టు 15 తర్వాత ఇంటర్వ్యూలు జరుగుతాయని, ఒకే రోజులో ఇంటర్వ్యూ ప్రక్రియను పూర్తిచేస్తారని సంబంధిత వర్గాలు తెలిపాయి. తొలుత ఇంటర్వ్యూలను ఆగస్టు 13, 14వ తేదీల్లో నిర్వహించాలని భావించాం. ప్రధాన కోచ్ పదవికి దరఖాస్తు చేసిన అభ్యర్థులలో సుమారు ఆరు మందిని ఇంటర్వ్యూకు ఎంపిక చేశాం. వారికి ఇంటర్వ్యూ చేయడానికి ఒక రోజు సరిపోతుంది. పేపర్ వర్క్ మిగిలి ఉండటంతో ప్రక్రియ వాయిదా వేయాల్సి వస్తుంది. ఆగస్టు 15 లోపు ఈ ప్రక్రియ జరగదు. కోచ్ ఎంపికపై భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ అభిప్రాయాన్ని తీసుకోవట్లేదు. క్రికెట్ సలహా కమిటీ టీమిండియా కోచ్‌ను ఎంపిక చేస్తుంది. భారత మహిళా జట్టు కోచ్ ఎంపిక ప్రక్రియ మాదిరిగానే ఇది నిర్వహిస్తున్నాం. అని వెల్లడించాయి.

క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ) టీమిండియా కోచ్‌ను ఎంపిక చేయనుంది. కపిల్‌దేవ్, అన్షుమన్ గైక్వాడ్, శాంత రంగస్వామి బృందం ఇంటర్వ్యూలను నిర్వహించనుంది. కోచ్ ఎంపిక గురించి భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ తన అభిప్రాయాన్ని వెస్టిండీస్ పర్యటనకు బయలు దేరడానికి ముందు నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపాడు. రవి భాయ్‌తో మా అందరికీ మంచి బంధం ఉంది. అతణ్నే కోచ్‌గా కొనసాగిస్తే చాలా సంతోషిస్తాం. కానీ కోచ్‌పై నిర్ణయం తీసుకోవాల్సింది క్రికెట్ సలహా కమిటీనే. ఈ విషయంపై సీఏసీ ఇప్పటివరకు నన్ను సంప్రదించలేదు. నా అభిప్రాయం అడిగితే చెబుతా అని కోహ్లీ పేర్కొన్నాడు. విండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా రేపు భారత్ రెండో వన్డేను పోర్ట్ ఆఫ్ స్పెయిన్‌లో ఆడనుంది. తొలి వన్డే వర్షం కారణంగా రద్దైన విషయం తెలిసిందే.

# అన్నూర్ ప్లే స్కూల్‌లో బక్రీద్ వేడుకలు ....



కంచరపాలెం : జీవీఎంసీ 40 వ వార్డు పరిది పార్వతీ నగర్ వద్ద నున్న అన్నూర్ ప్లే స్కూల్ లో శనివారం ఉదయం బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు . ఈమేరకు చిన్నారులు ముస్లిం వేషధారణలో ఆలరించారు.

ఒకరికొకరు అలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ శుభకాంక్షలు తెలుపుకున్నారు .కార్యక్రమంలో బాగంగా స్కూల్ సిబ్బంది చిన్నారులకు మిఠాయిలు అందజేశారు . కార్యక్రమాన్ని స్కూల్ కరస్పాండెంట్ షేక్ ఫరిద్ పర్యావేక్షించారు.

కార్యక్రమంలో ప్రిన్స్ పల్ షహరత్ బీబీ , ఉపాద్యాయులు పెద్ద సంఖ్యలో చిన్నారులు పాల్గున్నారు .

## మరో కాణిపాకం.. చోడవరంలో స్వయంభూ విఘ్నేశ్వరుడు

### వైభవంగా ఉత్సవ రాట మహోత్సవం



చోడవరం: రాష్ట్రంలోనే మరో కాణిపాకంగా విరాజిల్లుతున్న చోడవరం పట్టణంలోని స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో గణపతి నవరాత్రి ఉత్సవరాట మహోత్సవం దశమి శనివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా స్థానిక ఎమ్మెల్యే ఉత్సవ గౌరవ అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ పాల్గొని ఉత్సవ రాట వేశారు. అనంతరం ఎమ్మెల్యే ధర్మశ్రీని దేవాదాయశాఖ అధికారులు, శ్రీ బాలగణపతి సేవా సంఘం వారు ఘనంగా సత్కరించి, వేద పురోహితులచే ఆశీర్వచనాలు అందచేశారు. అంతకు ముందు బాల గణపతి సేవా సంఘం ఉపాధ్యక్షుడు పప్పల జయదేవ్ దేవస్థానం కార్యనిర్వహణాధికారి యస్.వి.వి. సత్యనారాయణ మూర్తి, ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి గణేష్, అర్చకులు చలపతి ఆధ్వర్యంలో కార్యసిద్ధి విఘ్నేశ్వరస్వామికి గణపతి పూజ, వాస్తు పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చోడవరం ఫారెస్ట్ రేంజ్ అధికారి రామ్ నరేష్ బిర్లంగి, ఎస్.ఐ, డి.లక్ష్మీనారాయణ, రిటైర్డు తహసీల్దారు పెంటకోట అప్పలనాయుడు, సి.ఐ, యూ.వి. సూర్యనారాయణ, నరసింహం పంతులు, ఆర్కె ప్రసాద్, వై.సిపి మండల అధ్యక్షులు పల్లా నరసింగరావు, టౌన్ అధ్యక్షులు పుల్లేటి వెంకటరావు, మండల శెక్రటరీ సూరిశెట్టి నాగదుర్గ గోవింద, శరగడం నాగేశ్వరరావు, సకలా సూరిబాబు, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు అల్లాడ భవాని, వై.సి.పి నాయకులు బొడ్డు శ్రీరామమూర్తి, ఓరుగంటి నెహ్రూ, జ్యోతుల రమేష్, శ్రీ బాలగణపతి సేవా సంఘం సభ్యులు ఉప్పల బాబు,ఎస్.వి. మధు, పప్పు దేముడు, రామారావు, ముసలయ్య, విజయ, మంగ అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ సాధన లక్ష్యంగా కష్టపడి చదవాలి

### ప్రశాంతి విద్యాసంస్థల అధినేత ధర్మిరెడ్డి ప్రసాద్

అచ్యుతాపురం: ఉద్యోగ సాధన లక్ష్యంగా పట్టుదలతో కష్టపడి చదవాలని ప్రశాంతి పాలిటెక్నిక్ విద్యాసంస్థల అధినేత ధర్మిరెడ్డి ప్రసాద్ అన్నారు .శుక్రవారం స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో సిఐటియు ,డివైఎఫ్ఐ , జెవివి ఆద్వర్యంలో స్టీల్ ప్లాంట్, గ్రామ సచివాలయం ఉద్యోగాలకు ఉచిత కోచింగ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులు పాఠ్యంశాలలో మంచి మార్కులు తెచ్చుకున్న ఉద్యోగాలు పొందలేకపోతున్నారన్నారు. ఉచిత కోచింగ్ ను సద్వినియోగం చేసుకుని అనుకున్నది సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టీల్ ప్లాంట్ ఉద్యోగి ఆళ్ళ అప్పలనాయుడు ,జె వి వి నాయకులు మారిశెట్టి వెంకటప్పారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి రొంగలి రాము, డివైఎఫ్ఐ నాయకులు కూండ్రపు సోమునాయుడు, సాయి, శివాజి తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పక్కాగా నిర్వహించండి

### పరిశీలించిన జెసి



శ్రీకాకుళం : స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలను పక్కాగా నిర్వహించనున్నట్లు సంయుక్త కలెక్టర్ పి.రజనీకాంతారావు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించు నిమిత్తం శనివారం ఆర్ట్స్ కాలేజీ మైదానాన్ని జెసి పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, జెండా వందన కార్యక్రమం, ప్రభుత్వ శకటాల ప్రదర్శన, స్టాళ్ళ ఏర్పాటు, మార్చ్ ఫాస్ట్, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, వి.ఐ.పిలు, అధికారుల సీటింగ్ ఏర్పాట్లను పక్కాగా నిర్వహించనున్నట్లు తెలిపారు. గతేడాది ఇదే మైదానంలో రాష్ట్రస్థాయి వేడుకలు జరిగాయని, అదే స్ఫూర్తితో ఈ ఏడాది వేడుకలను నిర్వహించనున్నామని తెలిపారు. జిల్లాకలెక్టర్ వారి నిర్దేశాల మేరకు రెవెన్యూ డివిజనల్ అధికారి, తహశీల్దారుల పర్యవేక్షణలో కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించనున్నట్లు తెలిపారు. మంచినీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యాలను కలిగించవలసినదిగాను, మైదానాన్ని చదును చేయవలసినదిగాను సంబంధిత అధికారులను జెసి ఆదేశించారు.

ఈ కార్యక్రమానికి నగరపాలక సంస్థ కమీషనరు శ్యాం దేవ్ కుమార్, రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం.వి.రమణ, తహశీల్దార్ ఐ.టి.కుమార్, తదితరులు హాజరైనారు.

## విశాఖ జిల్లా ముఠా వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి




విశాఖపట్నం: విశాఖ జిల్లా ముఠా వర్కర్స్ యూనియన్ జిలా 8వ మహాసభలు ఆగస్టు 18,19 తేదీల్లో జగదాంబ వద్దగల సిఐటియు ఆఫీస్‌లో జరుగుతాయి. ఈ సందర్భంగా 18వ తేదీ ఉదయం 10గంటలకు పూర్ణామార్కెట్ నుండి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ అనంతరం బహిరంగసభ జరుగుతుంది. ఈ మహాసభలను జయప్రదం చేయాలని శనివారం యూనియన్ జనరల్‌బాడీ సమావేశం యూనియన్ ప్రధానకార్యదర్శి ఎం.సుబ్బారావు అధ్యక్షతన సిఐటియు ఆఫీస్ వద్ద జరిగింది.

ఈ సమావేశానికి ముఖ్యవక్తగా హాజరైన సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.కె.ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ విశాఖ నగరంలో వివిధ మార్కెట్లు, షాపింగ్‌మాల్స్, గోడౌన్స్ నందు లోడింగ్, అన్‌లోడింగ్ పనులు చేస్తున్న కళాసీలు సుమారు 4000మంది ఉన్నారు. వీరు ప్రతిరోజు ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ప్రజలకు అవసరమైన నిత్యావసరసరుకులు, సిమెంట్, ఐరన్, మార్బుల్, ప్లేవుడ్, గ్లాస్ తదితర సామాన్లు లోడింగ్, అన్‌లోడింగ్ పనులు చేస్తుంటారు. వీరికి పిఎఫ్, ఇఎస్ఐ, పెన్షన్, బీమా వంటి ఏవిధమైన సౌకర్యాలు లేవు. పనిలో ప్రమాదం జరిగితే ఆదుకునే నాదుడేలేరు. వీరందరికి పనిభద్రతా, ప్రమాదబీమా, పిఎఫ్, ఇఎస్ఐ, పెన్షన్, గ్రాట్యూటీతో కూడిన సమగ్రచట్టం చేయాలని, వెల్ఫేర్‌బోర్డు ఏర్పాటు తదితర డిమాండ్లపై ఈ మహాసభల్లో చర్చించి వాటి సాధనకోసం భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. కావున నగరంలో ఉన్న ముఠా కళాసీలందరూ పాల్గొని ఈ మహాసభలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేసారు.

ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు వై.రాజు, అధ్యక్షులు పైడిరాజు, వెంకటరావు, మహేష్, అప్పలరెడ్డి, వరహాలు, దుర్గారావు, దేవుడు, పైడిశెట్టి, రమణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన



భీమునిపట్నం: బారత ప్రభుత్వం ఆదేశాల మేరకు జాతీయ సేవాపధకం ఆద్వర్యంలో ఈ నెల ఒకటవ తేది నుండి పదిహేనో తేది వరకు స్వచ్ఛ పక్వాడ 2019 కార్యక్రమం స్థానిక ఎస్.వి.ఎల్.ఎన్. కళాశాల లో ఎన్. ఎస్.ఎస్. వాలంటీర్లు. ఈ నెల తొమ్మిది పదవ తేదీలల్లో ఎన్.ఎస్.ఎస్.దత్త గ్రామము అయిన గొల్లల తాళ్ళవలస లో,పరిసరాల సుభ్రత, ఇంకుడు గుంతల ప్రాదాన్యత బహిరంగ మలవిసర్జన కలిగే అనారోగ్యం మరియు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమం లో ఎన్. ఎస్.ఎస్. వాలంటీర్లు తో పాటు గ్రామస్తులు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.నాగలక్ష్మమ్మ ఆద్వర్యంలో విజయవంత మైనదని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి గ్లోరి దయాకుమారి తెలియజేసారు.

## అవంతిలో ఇండక్షన్ మీట్ 2019 కార్యక్రమం



భీమునిపట్నం: తగరపువలస అవంతీ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ లో ఇండక్షన్ మీట్ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని గౌరవ అతిధి ఆంధ్ర విశ్వ విద్యాలయం మెకానికల్ ఇంజనీరంగ్ ఆచార్యులు ప్రొఫెసెర్ ఎన్ రమణయ్య జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆంగ్ల భాష నైపుణ్యం చురుకుదనంతో కూడిన భావ వ్యక్తీకరణ ప్రశ్నించేతత్వంతో పాటు శారీరక ఆరోగ్యం అవసరమని నేడు మొబైల్ ఫోన్స్ మనుషుల మానసిక వికాసం పై చాలా ప్రభావం కలిగిస్తుందని వీటిని అవసరం మేరకే ఉపయోగించాలని తెలియజేశారు, గౌరవ అతిధి ఎ.ఎం జడ్.యు. ఆర్ టెక్నాలజీస్ హెచ్. ఆర్. మేనేజర్ కస్తూరిరావు మాట్లాడుతూ కృషి వుంటే మనుషులు ఏదైనా సాధిస్తారని మనిషి యొక్క భవిష్యత్తు నేటి జ్ఞానం ,నైపుణ్యం మరియు ప్రవర్తన పై ఆదారపడి ఉంటుందని. ప్రతీ విద్యార్థి చదువులో కొన్ని మెలకువలు నేర్చుకోవాలని ,తల్లిదండ్రులు కు మంచిపేరు తేవాలని, వాళ్ల ఆశయాలను నిలబెట్టాలని అన్నారు. కళాశాల ప్రిన్స్ పాల్ డాక్టర్ ఎస్.ఎన్.వి,గణేష్ మాట్లాడుతూ అవంతీ విద్యా సంస్థలు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలుతో కూడిన ఇంజినీర్స్ తో పాటు సామాజిక విలువలు తో కూడిన పౌరలను తయారు చేసి దేశానికి అందిచగలమని అందుకు తల్లిదండ్రులు కళాశాలతో మంచి సంబందాలు కలిగి సహకరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అవంతి విద్యాసంస్థల జనరల్ సెక్రెటరీ యం.ప్రియాంక. మేనేజింగ్ డైరెక్టర్ శ్రావణ్ కుమార్ , జే ఎన్ .టి.యు ప్రొఫెసర్ (కాకినాడ) జె.వి.ఆర్ మూర్తి, ఎయు మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ ఎన్.రమణయ్య, అవంతి గ్రూప్ ఆఫ్ కాలేజ్ డైరెక్టర్ ఎ చంద్రశేఖర్ , ఎస్,రాఘవరావు, డాక్టర్ టి శ్రీనివాసరావు ఎ అర్జునరావు,జే ఆర్ జి పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం ఆనకట్టలకు దేవతామూర్తుల పేర్లు

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి రికార్డు స్థాయిలో పూర్తి చేసిన కాళేశ్వరం ప్రాజెక్టులోని ఆనకట్టలు, పంప్ హౌస్‌లకు దేవతామూర్తుల పేర్లు పెట్టారు.

ఈ మేరకు ఆయా ఆనకట్టలు, పంప్ హౌస్‌లకు ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్లను ఖరారు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మొదటి ఆనకట్ట అయిన మేడిగడ్డ ఆనకట్టకు లక్ష్మి ఆనకట్టగా... దాని ఎగువన కన్నేపల్లి వద్దనున్న పంప్ హౌస్‌కు లక్ష్మి పంప్ హౌస్ అని నామకరణం చేశారు. వరుస ఆనకట్టల్లో రెండో ఆనకట్ట అయిన అన్నారం ఆనకట్టకు సరస్వతి ఆనకట్టగా, అన్నారం పంప్ హౌస్‌కు సరస్వతి పంప్ హౌస్‌గా పేరు పెట్టారు. అలాగే, సుందిళ్ల ఆనకట్టకు పార్వతి ఆనకట్ట అని, గోలివాడ పంప్ హౌస్‌కు పార్వతి పంప్ హౌస్ అని పేరు పెట్టారు.



రెండో లింక్‌లో నందిమేడారం వద్ద ఉన్న ఆరో ప్యాకేజీలోని జలాశయం, పంప్ హౌస్‌లకు నంది జలాశయం, పంప్ హౌస్‌గా నామకరణం చేశారు. ఎనిమిదో ప్యాకేజీలోని లక్ష్మీపూర్ పంప్ హౌస్‌కు గాయత్రి పంప్ హౌస్ అని పేరు పెట్టారు.

## చిన్నపిల్లల కోసం ప్రత్యేక వైద్య శిబిరం



విశాఖపట్నం : విశాఖ, దక్షిణ నియోజకవర్గం, 25 వ వార్డు, వన్టౌన్లో ఉన్న శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో.. శనివారం పిల్లల కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. చిలక పేట, వాడ వీధి, నల్లవారివీధి, చాగంటివారి వీధి తదితర ప్రాంతాల్లోని చిన్నారులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ జహీర్ అహ్మద్, ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ముస్తాక్ అహ్మద్ వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో..మక్సూద్ అహ్మద్, కంటుముచ్చు తాతారావు సంస్థ అధ్యక్షులు సూరాడ అప్పారావు, డిఎస్.అగర్వాల్ ఎం ఎస్ ఎన్. పాత్రుడు మొల్లి నాగేశ్వరరావు, చేపల పైడ్రాజు, వాసుపల్లి ఉమాదేవి, అంతోనీ లక్ష్మి పాల్గొన్నారు.

## గిరిజన ఉత్పత్తుల అమ్మకంతో స్వయం ఉపాధి

- అమ్మకాలపై 30 శాతం లాభం
- ఫ్రాంచైజ్ కావాలంటే 2 లక్షలు మదుపుపెట్టండి
- ప్రభుత్వ ఉద్యోగులకు లాయల్టీ కార్డులు
- నిత్యావసరాలతో చిరుధాన్యాల పంపిణీ
- జీసీసీ యండీ బాబూరావు నాయుడు





విశాఖపట్నం : గిరిజన సహకార సంస్థ అటవీ ఉత్పత్తులను ముందు నుంచి తమ సొంత సంస్థ ద్వారా అమ్మకాలు చేపట్టేది. గిరిజన ప్రాంతాలైన అరకు, పాడేరు, అనంతగిరి, ముంచి ంగిపుట్ తదితర గిరిజన ప్రాంతాలలో గిరిజనులు పండించే అటవీ ఉత్పత్తులను ఈ జీసీసీ సంస్థ ద్వారా ప్రజలకు అమ్మకాలు సాగించేవారు. నేడు పట్టణ ప్రాంతాలలో కూడా అటవీ ఉత్పత్తులకు గిరాకీ ఎక్కువ పెరుగుతుండడంతో పట్టణాలలో కూడా జీసీసీ సంస్థ తమ కార్యాలయాలు స్థాపించి అమ్మకాలు చేపట్టింది. దీని ద్వారా ఉన్న లాభాలు విస్తరింపజేయాలని సంస్థ తలంచి నేడు విశాఖపట్నం తదితర ముఖ్య పట్టణాలలో తమ ఫ్రాంచైజీలు ఏర్పాటు చేయాలని జీసీసీ యండీ బాబూరావు నాయుడు పేర్కొన్నారు. ఇందులో భాగంగా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు ఎక్కువ కల్పించాలనే ఉద్దేశ్యంతో గిరిజన సహకార సంస్థ తమ మార్కెటింగ్ నెట్‌వర్క్‌ను విస్తృతం చేయదలచి నిరుద్యోగ యువతకు పెట్టుబడి ద్వారా మంచి అవకాశం కల్పిస్తోంది. ఫ్రాంచైజ్ పెట్టుబడికి కేవలం 2 నుండి 3 లక్షలు పెట్టుబడి పెట్టగలిగి, 150 నుండి 200 చ.గ. వాణిజ్య స్థలం సమకూర్చుకుంటే సరిపోతుంది. జీసీసీ సంస్థ తమ ఉత్పత్తులను వారికి అందజేసి విక్రయాలపై 30 శాతం మార్జిన్ మనీని అందజేస్తుంది. ఈ విధానం నిరుద్యోగులకు మంచి ఉపాధి అని యాజమాన్యం పేర్కొంటోంది. జీసీసీ ఉత్పత్తులైన చింతపండు, తేనె, ఎండుమిర్చి, పసుపు, కారం, చీపుర్లు, అరకు కాఫీ, టీ. సబ్బులు, కుంకుళ్లు, శీకాకాయ్ షాంపూ, చిరుధాన్యాలు రాగి బిస్కెట్లు, ఆమ్లా పౌడర్, త్రిఫలచూర్ణం తదితర సామగ్రి అన్నీ సరఫరా చేస్తారు.

నిరుద్యోగులకే కాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు కూడా ఈ ఫ్రాంచైజ్‌ల ద్వారా జీసీసీ ఉత్పత్తులపై 15 శాతం డిస్కౌంట్ ఇవ్వడం జరుగుతుంది. జీసీసీ వెబ్‌సైట్‌లో తమ పేరు నమోదు చేసుకుంటే అటువంటి వారికి లాయల్టీ కార్డు పంపించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ విధమైన లాభాన్ని కేవలం ప్రభుత్వ ఉద్యోగులకే కాకుండా ప్రైవేటు ఉద్యోగులకు, గృహిణులకు కూడా త్వరలో అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. మిగిలిన వివరాలకు మార్కెటింగ్ కన్సల్టెంట్ 7702661122కు, ఆర్ఎండీ జనరల్ మేనేజర్ 9490166280 నెంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోగలరని జీసీసీ యండీ బాబూరావు నాయుడు పేర్కొన్నారు.



## కె.కె.రాజును కలిసిన కొత్త సి ఐ లు



సితమ్మధార : కొత్తగా నియమితులయిన 5వ పట్టణ పోలీస్ స్టేషన్ సి.ఐ కృష్ణారావు మరియు ద్వారాకనగర్ పోలీస్ స్టేషన్ సి.ఐ వై మురళి లు విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ను సీతమ్మదారా లో గల ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

## ఎన్‌టీపీసీకి భారీ లాభాలు..!

న్యూదిల్లీ : ప్రముఖ ప్రభుత్వ రంగసంస్థ ఎన్‌టీపీసీ శనివారం జూన్ త్రైమాసిక లాభాలను ప్రకటించింది. ఈ త్రైమాసికంలో సంస్థ లాభాలు రూ.2,840 కోట్లకు చేరుకున్నట్టు తెలిపింది. దీంతో లాభాల్లో 5.68శాతం వృద్ధి నమోదైంది. గత ఏడాది ఇదే సమయంలో రూ.2,688 కోట్ల లాభాన్ని ఆర్జించింది. ఈ విషయాన్ని కంపెనీ నేడు బీఎస్‌ఈ ఫైలింగ్‌లో పేర్కొంది. కంపెనీ మొత్తం ఆదాయం రూ.26,272 కోట్లకు చేరింది.

## రహదారి విస్తరణలో ఆలయానికి ఇబ్బంది కలగకుండా చూడండి

### ఎమ్మెల్యేకు భక్తులు, ఆలయ సిబ్బంది వినతి



చోడవరం : పట్టణంలోని ఆర్. అండ్ బి రహదారి విస్తర్ణలో స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయానికి ఎలాంటి ఇబ్బంది, నష్టం కలగకుండా చూడాలంటూ స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి దేవాదాయశాఖ కార్యనిర్వహణాధికారి యస్.వి.వి.సత్యనారాయణ మూర్తి, ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి గణేష్ కోరారు. విఘ్నేశ్వర ఆలయానికి ఇప్పటికే భక్తుల తాకిడి వలన స్థలాభావ సమస్య ఏర్పడటంతో దేవాలయానికి పరిసర ప్రాంతాల నుంచి, ఇతర దూర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు, టూరిస్టులు వాహన పార్కింగ్ ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డు విస్తరణతో వాహన పార్కింగ్‌లకు మరింత ఇబ్బందికలిగే అవకాశం ఉందని, రహదారి విస్తరణలో ఆలయానికి ఇబ్బంది కలగకుండా చూడాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో పుల్లేటి వెంకటరావు, జ్యోతుల నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### సంక్షోభంలో వైద్యరంగం

కేంద్ర ప్రభుత్వం తోచిందే తడవుగా నిర్ణయాలు చేస్తూ పోతున్నది. ఎలాంటి చర్చలు, ప్రజాభిప్రాయాలకు తావులేకుండా పార్లమెంటులో ఉన్న మెజారిటీ బలంతో బిల్లుల రూపేణా విధాన నిర్ణయాలతో దూసుకుపోతున్నది. దేశవ్యాప్తంగా వైద్య విద్యార్థులు, వైద్యులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) లాంటి దేశవ్యాప్త సంస్థ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) బిల్లును కేంద్రం ఆమోదించింది. దీంతో జవాబుదారీతనంతో కూడిన అవినీతికి తావులేని, ప్రజానుకూల వైద్య విధానాన్ని తెస్తామని మోదీ ప్రభుత్వం అంటున్నది. ఈ క్రమంలో దశాబ్దాలుగా దేశ వైద్య విధానానికి మూలస్తంబంగా ఉన్న భారతీయ మెడికల్ కౌన్సిల్ (ఎంసీఐ)ని రద్దు చేస్తూ, పొంతనలేని వాదనను ముందుకుతెచ్చింది. అవినీతిలో కూరుకుపోయిన ఎంసీఐని రద్దుచేసి జవాబుదారీతనంతో కూడిన ఎన్‌ఎంసీకి రూపకల్పన చేశామంటున్నది. ఈ క్రమంలో మోదీ ప్రభుత్వం ప్రజాస్వామిక, సమాఖ్యస్ఫూర్తికి తూట్లు పొడిచింది. క్యాబినెట్ సెక్రటరీ నేతృత్వంలోని సెర్చ్ కమిటీ ఎన్‌ఎంసీ కౌన్సిల్ సభ్యులను ఎంపిక చేస్తుంది. 25 మంది సభ్యులుండే కౌన్సిల్‌లో ఐదుగురు మాత్రమే వైద్యవృత్తికి సంబంధించిన వారుంటారు. మిగతావారంతా వైద్యవృత్తితో సంబంధం లేని, కేంద్రంలోని ప్రభుత్వ కనుసన్నల్లో నడిచే వారుంటారనటంలో సందేహం లేదు. అలాగే ముగ్గురు సభ్యులుండే నాలుగు స్వయం ప్రతిపత్తిగల బోర్డులు నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు సహాయకరంగా పనిచేస్తాయని చెప్పుకొస్తున్నారు. మొత్తంగా రూపంలో, సారంలో ఎన్‌ఎంసీ అనేది కేంద్ర ప్రభుత్వాధిపత్యం, అజమాయిషీలో నడుస్తుందని తేటతెల్లమవుతున్నది. దేశవ్యాప్త ప్రాతినిధ్యంతో ప్రజాస్వామికంగా ప్రత్యక్ష ఎన్నికల ద్వారా నిర్మాణమయ్యే ఎంసీఐ ని రద్దుచేసి తమ కనుసన్నల్లో నడిచే సంస్థగా దిగజార్చటం గర్హనీయం. సుదీర్ఘ చరిత్ర కలిగిన 1956నాటి ఎంసీఐని రద్దుచేయటం వాంఛనీయం అనిపించుకోదు. దేశవ్యాప్త ప్రాతినిధ్యంతో ఎంసీఐ భారతీయ వైద్యాభివృద్ధికి ఎంతో కృషిచేసింది. అన్ని రాష్ట్రా లు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి వైద్యుల నుంచి నేరుగా ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నికైన 120 మంది ఎంసీఐ సభ్యులుగా ఆయా ప్రాం తాలకు ప్రాతినిధ్యం వహిస్తారు. విశాలమైన భారతావనిలో వివిధ ప్రాంతాల్లోని ప్రజల ఆరోగ్య అవసరాలు, తీసుకోవాల్సిన చర్యల గురించి, వైద్య విధానంలో తీసుకురాదల్చిన సంస్కరణలు, అభివృద్ధి గురించి చర్చించి విధాన నిర్ణయంలో భాగస్వాములవుతారు. ఎంసీఐ నిర్మాణం, వ్యవహారణ అంతా ప్రజాస్వామికంగా, ఫెడరల్‌స్ఫూర్తికి ప్రతిబింబంగా ఉంటుంది. ఇలాంటి దాన్ని రద్దుపరిచి, పూర్తిగా పరోక్ష నియామకం ద్వారా ఏర్పడే ఎన్‌ఎంసీని ఏర్పాటుచేయటం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం. ఎంసీఐకి ఎన్నికైన 120 మందిలో ఎవరో కొందరు అవినీతికి పాల్పడుతున్నారని ఏకంగా దశాబ్దాల చరిత్ర ఉన్న ఎంసీఐని రద్దు చేస్తామనటం కేంద్రం అరువు తెచ్చుకున్న సాకు మాత్రమే. అలాగే నేషనల్ మెడికల్ కౌన్సిల్ ప్రైవేటు వైద్యకళాశాల యాజమాన్యాల ప్రయోజనాల కు పెద్దపీట వేసి, పేదలకు వైద్యవిద్యను దూరం చేసే పనిని నేర్పుగా చేసింది. గతంలో అయితే ప్రైవేటు వైద్య కళాశాలల్లో 15 శాతం మాత్రమే యాజమాన్య కోటాగా వైద్యసీట్లు ఉండేవి. వాటిని యాజమాన్యాలు ఇష్టానుసారం అమ్ముకునేవారు. ఇప్పుడు వాటిని 50 శాతానికి పెంచి, ఫీజు తదితరాలను యాజమాన్యాలకు వదిలేయటం గమనార్హం. నేషనల్ మెడికల్ కమిషన్ విధానాల్లో ముఖ్యమైనది వైద్యవృత్తి చేపట్టగోరే వారి విషయంలో తీసుకొచ్చిన విధానపరమైన మార్పులు తీవ్రమైనవి. వైద్యవిద్య అయిపోయిన వారు ఎవరైనా వృత్తి చేపట్టేందుకు లైసెన్సియేట్ పరీక్షలో ఉత్తీర్ణులు కావాలనే నిబంధన పెట్టారు. గతంలో అయితే ఇక్కడ ఎంసెట్, నీట్ లాంటి పరీక్షలు ఉత్తీర్ణులు కాకుండా విదేశాల్లో వైద్యవిద్య చదివి వచ్చినవారికే ఇలాంటి పరీక్ష నిర్వహించేవారు. ఇక్కడ నీట్ లాంటి కఠిన పరీక్షల్లో ఉత్తీర్ణులై, ర్యాంక్ సాధించి వైద్యవిద్యలో భాగంగా థియరీ, ప్రాక్టికల్స్ అవసరమైనంతగా చేసి, క్లినికల్ ప్రాక్టీస్ కూడా అయిపోయి ఉత్తీర్ణులైన వారు కూడా వృత్తి చేపట్టేందుకు నెక్ట్స పరీక్ష రాయాలనటాన్ని వైద్యవిద్యార్థుల తో సహా, ఐఎంఏ కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. ఎలాంటి విద్య, వృత్తి నైపుణ్యాలు లేకుండా విదేశాల్లో చదివి వచ్చిన ధనవంతుల పిల్లలకు, ఇక్కడి వారితో సమానావకాశాలు కల్పించటానికే ఇదంతా అనే ఆరోపణలున్నాయి. మరీ ముఖ్యంగా మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నాపత్రంతో వైద్య విద్యార్థుల నైపుణ్యాలను పరీక్షిస్తామనటం అసమంజసం. నిజానికి ఏటా 60 వేల మంది వైద్య విద్యార్థులు పట్టా అందుకొని సమాజంలో అడుగుపెడుతున్నారు. వారందరూ తమకు పని కల్పించమ ని కోరుతున్నారు. సరైన సదుపాయాలు, వైద్యపరికరాలు అందించి వైద్యసేవలకు తమను వినియోగించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. దేశంలో సరైన వైద్యనిపుణులు అందుబాటులో లేక గ్రామీణ వైద్యరంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది.

## ఏపీని పేదరాష్ట్రం అంటారా?: లోకేశ్



అమరావతి: విజయవాడలో శుక్రవారం నిర్వహించిన డిప్లొమాటిక్ ఔట్‌రీచ్ సదస్సులో పెట్టుబడులను ఆకర్షిస్తూ చేసిన ప్రసంగంలో ముఖ్యమంత్రి జగన్ ఏపీని పేద రాష్ట్రం అని అన్నారని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆరోపించారు. ఎవరైనా మన బలాల గురించి చెప్పి పెట్టుబడులను ఆకర్షిస్తారని, తెదేపాపై కోపంతో రాష్ట్రం ప్రగతిని చెప్పుకోకపోతే పెట్టుబడులు రావని హితవు పలికారు.

ఆంధ్రప్రదేశ్ గత మూడేళ్ళ కాలంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉందని, ఆరోగ్య సూచిలో దేశంలో రెండో స్థానంలో ఉందని గర్వంగా చెప్పాలని లోకేష్ సూచించారు. రాష్ట్రానికి స్వచ్ఛ భారత్ ర్యాంకింగ్స్ లో మొదటి 10 నగరాల్లో మూడు నగరాలకు స్థానం లభించిందని, రెండంకెల వృద్ధి సాధించిందని చెప్పాలన్నారు.

రాష్ట్రంలో అపారమైన నైపుణ్య మానవ వనరులు ఉన్న యువత ఉన్నారనే విషయాన్ని ఇండియా స్కిల్స్ రిపోర్ట్ చెప్పిందని, గత 5 ఏళ్ళలో 700 కేంద్ర అవార్డులు గెలుచుకుందని, ఇలా మన రాష్ట్రం గురించి గొప్పగా చెప్పుకోవటానికి ఎన్నో ఉన్నాయని జగన్‌కు సూచించారు. ఇలాంటివి కాకుండా.. మేము ఇన్ని సీట్లు గెలిచాం, అన్ని సీట్లు గెలిచాం అంటే పెట్టుబడులు రావని లోకేశ్ హితవు పలికారు.

# నూతన ఆవిష్కరణలకు వర్శిటీలు దిశానిర్దేశం చేయాలి




ఏ చదువూ లేని ప్రజలు సహితం తమ అవసరాల కోసం నూతన మార్గాలను కనిపెట్టిన సందర్భాలు ఉన్నాయన్నారు. భారత దేశం ఎందరో శాస్త్రవేత్తలకు పుట్టినిల్లు అని అయితే దురదృష్టవశాత్తూ నేడు మేధోవలస కారణంగా విదేశీ విశ్వవిద్యాలయాలు ర్యాంకింగ్‌లలో, నూతన ఆవిష్కరణలలో మనకంటే ముందు ఉన్నాయన్నారు. 1930 తరువాత భారత దేశం నుంచి ఒక్కరికి కూడా నోబెల్ బహూమతి లభించక పోవడం గమనించాలన్నారు. భారతీయుల ప్రతిభకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉందని, మారుతున్న ప్రపంచ ఆర్థిక వాతావరణంలో ప్రతి అవకాశాన్ని మనం సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిపుణతతో కూడిన మానవ వనరులను తయారు చేయడానికి విద్యాలయాలు, అద్యాపకులు నిత్యం తమను తాము మెరుగు పరచుకోవాలని సూచించారు. విశ్వవిద్యాలయాలు పరిశ్రమలతో అనుసంధానం అవుతూ నైపుణ్యం గల మానవ వనరులను తీర్చిదిద్దడమేకాక పరిశోధనలపై నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని ఆయన పిలుపునిచ్చారు.

గీతం39వ వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా మాజీ రాష్ట్రపతి భారతరత్న ప్రణబ్ ముఖర్జీకు గీతం అదక్షుడు ఎమ్.శ్రీభరత్ గీతం ఫౌండేషన్ అవార్డు-2019తో పాటు 10 లక్షల రూపాయల అవార్డు మొత్తాన్ని అందజేశారు. అంతకు ముందు, అత్యుత్తమ సేవలు అందించిన బోధన, బోధనేతర సిబ్బందికి అవార్డులను అందజేశారు.



( మొదటి పేజీ తరువాయి )

ఉందని, పరిశోధకులను ఆర్థికంగా ప్రోత్సహిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చునని అభిప్రాయిపడ్డారు. దేశంలోని విద్యాలయాలకు తగినంత స్వేచ్ఛను ఇస్తే ప్రపంచంలోని అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాలతో పోటీపడగల సామర్థ్యం పెరుగుతుందన్నారు. గతంలో ప్రపంచంలోని మొదటి రెండువందల అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల జాబితాలో భారతదేశం నుంచి ఒక్క విద్యాసంస్థ స్థానం సంపాదించలేదని, దీనిపై తాను రాష్ట్రపతిగా ఉన్న సమయంలో విద్యాలయాలతో జరిగే సమావేశాలలో తరుచు ప్రస్తావిస్తూ ఉండేవాడినన్నారు. నేడు క్యూఎస్ ర్యాంకింగ్‌లలో భారతదేశానికి చెందిన 23 విద్యాలయాలు స్థానం సంపాదించాయని అందులో 5 ప్రైవేటు విశ్వవిద్యాలయాలు కావడం విశేషమన్నారు. పరిశోధనలతో పాటు బోధనలో నూతనత్వం ద్వారా ప్రపంచ ర్యాంకింగ్‌లో దేశాన్ని అగ్రస్థానంలో నిలపవచ్చునని తద్వారా విద్యార్థులలో అత్మస్థైర్యం పెరుగుతుందని, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

శాస్త్ర సాంకేతిక రంగాలలో బలమైన పునాదులు కలిగిన దేశాలు అభివృద్ధి చెందిన దేశాలుగా పురోగమిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. పరిశోధన, నూతన ఆవిష్కరణ అనేవి సిద్ధాంతీకరించలేమని అలాగే వాటి అమలకు చట్టాలు చేయలేమన్నారు. గ్రామిణ ప్రాంతంలో ఉండే

## ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్ళాలి- కె కె రాజు




సితమ్మధార : జి.వి.యం.సి జోన్-2, విశాఖ ఉత్తర నియోజకవర్గం 12,14వార్డులకు సంబంధించి వార్డు వాలంటరీగా ఎంపిక అయిన అభ్యర్థులకు శిక్షణా తరగతులు 14 వార్డు రేసవాణిపాలెం కమ్యూనిటీ హల్ లో నిర్వహించారు. .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె కె రాజు మాట్లాడుతూప్రభుత్వం చేపడుతున్న ప్రతీ పథకం ప్రజలకు చేరు వయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి.వి.యం.సి అధికారులు,14 వార్డు అధ్యక్షురాలు జి.వి.రమణి,బాణాల శ్రీను,పోతు. సత్యనారాయణ,జి.వి.రమణా రెడ్డి,యస్.పద్మా రెడ్డి,గుడ్ల.భాస్కర్ రెడ్డి,ఉమామహేశ్వర రెడ్డి, సింగంపల్లి దేముడుబాబు,గుడ్ల అశోక్ రెడ్డి,జి.రవిబాబు,అమ్మాజీ,సుశీల, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఉచితంగా దంత పరీక్షలు




విశాఖపట్నం : మహాత్మ జ్యోతిబాపూలే బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ సింహాచలం లో రామమ్ అడ్వాన్స్ డెంటల్ కేర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సాయిరాం, పద్మిని, భవాని మరియు ఇతర సిబ్బంది దంత పరీక్షలను ఉచితంగా నిర్వహించడం జరిగింది. విశాఖపట్నం సెంట్రల్ జిఎస్‌టి అడిషనల్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యా ర్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, సమాజంలో అట్టడుగు స్థాయి నుండి ఎదిగిన వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని వారికి మార్గదర్శకము చేయడంతో పాటుగా ఉచితంగా విజేత కాంపిటీషన్ వారి జనరల్ నాలెడ్జ్, పర్సనాలిటీ డెవలప్మెంట్, స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాలను అందించారు. డాక్టర్ సాయిరాం మాట్లాడుతూ విద్యార్థులలో అధిక ఫ్లోరైడ్ లక్షణాలు ఎక్కువగా ఉన్నాయని, తాగే నీటిని పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ పాఠశాల పూర్వ విద్యార్థులు సంతోష్ కస్టమ్స్ ఇన్స్పెక్టర్ బాబూలాల్ జిఎస్టి ఇన్స్పెక్టర్, ఇస్రో సైంటిస్ట్ గణేష్ పాల్గొని విద్యారు ్థలకు సలహాలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా సాధు నరసింహారెడ్డి ఇ మరియు డాక్టర్ సాయి రాములను స్కూలు ప్రిన్సిపాల్ భద్రినాద్ మరియు ఇతర అధ్యాపకులు శాలువాతో సన్మానించారు.

## దుర్గాగణపతి నవరాత్రుల రాట మహోత్సవం



సితమ్మధార : 13 వార్డు సీతంపేటలో శ్రీశ్రీశ్రీ దుర్గాగణపతి నవరాత్రులు మహోత్సవంలో సందర్భంగా శనివారం రాట మహోత్సవం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 13వార్డు అధ్యక్షులు సారిపల్లి గోవింద్, శేఖర్ బాబు, బి.గోవింద, యం.నాగేశ్వరరావు, దాలి నాయుడు,యం. వెంకటరావు, యు.అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

## నియమ నిబంధనల మేరకే ఉత్పత్తులు తయారీ

### క్రైబ్ బయోకెమికల్స్ పరిశ్రమ

విశాఖపట్నం : కశింకోట మండలం కొత్తపల్లి గ్రామం సమీపం లో వున్న క్రైబ్ బయోకెమికల్స్ పరిశ్రమ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నియమనిబంధనలు మేరకు ఉత్ప త్తులను తయారుచేస్తుందని, దీనిపై అపోహలు అవాస్తవమని ఆ సంస్థ ఉపాధ్య క్షుడు బండారు అప్పలరాజు స్పష్టం చేశారు. నగరం లో శంకర మఠంరోడ్డు ఓ హోటల్లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావే శంలో ఆయన మాట్లాడుతూ గతంలో చిన్నచిన్న తప్పు ల వలన ఫిర్యాదులు మేరకు కాలుష్య నియంత్రణ మండలి తమ సంస్థపై తనిఖీలు నిర్వహించి పరిశ్రమ లో ఎటువంటి వ్యర్థాల ను ఉంచకుండా చేయాలని, కొంత మొత్తాని బ్యాంకు గ్యారెంటిని చెల్లించాలని సూచించిదన్నారు. ఆ చర్య ల్లో బాగంగా తమ సంస్థ కోటి 20లక్షలు రూపాయలు వెచ్చించి అప్పటి వరకు వున్న కాలుష్య జల శుద్ధి పద్ధతులను ప్రస్తుతం వున్న పర్యావరణ పద్దతులకు అనుకూలంగా సమూలంగా మార్పులు చేయడం జరిగిందని వెల్లడించారు.

కాలు ష్య నియంత్రణ మండలికి ఉత్పత్తి మొదల పెట్టుటకు దరఖాస్తులు సమర్పించడం జరిగిందన్నారు. తమ సంస్థను నడుపుటకు 3నెలలు వ్యవధిని కాలుష్య నియంత్రణ మండలి ఇవ్వడం జరిగిందన్నారు. పూర్తి అనుమతులు ఇచ్చేవిధంగా సమీక్ష జరిపి అవసరమైన సూచనలు తప్పకుండా పాటించడం జరుగుతుందన్నా రు. స్థానికంగా ఉద్యోగవకాశాలు, అలాగే స్థానికంగా వేసిన కమిటీ నిత్యం జరిగే కాలుష్య జలశుద్ధి పద్ధతులను గమనిస్తుందన్నారు. సంస్థ ఇకపై ఎటువంటి ఫిర్యాదులకు అవకాశం లేకుండా పారదర్శకంగా నడుస్తుందని తెలియజేశారు. ఎటువంటి ఫిర్యాదులు అందినా తమస్వయంగా సంప్రదించి తమ వివరణ కూడా తెలుసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో లీగల్ కన్సల్టెంట్ రమేష్ చౌదరి పాల్గొన్నారు.

## వైకాపా కేంద్ర కార్యాలయం ప్రారంభం

### వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల, ఘన నివాళి

### పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి






అమరావతి: గుంటూరు జిల్లా తాడేపల్లిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రారంభమైంది. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శనివారం ఉదయం నూతన కార్యాలయం ప్రారంభోత్సవం జరిగింది. ముఖ్యమంత్రి ఈ సందర్భంగా బాపట్ల ఎంపీ నందిగం సురేష్, పార్టీ నేత ఆమంచి కృష్ణమోహన్ చేత రిబ్బన్ కట్ చేయించారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి కార్యాలయంలోని అన్ని విభాగాలను పరిశీలించారు. కార్యాలయంలోని తన ఛాంబర్‌లోకి విచ్చేసిన ముఖ్యమంత్రికి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో రీజినల్ కోఆర్డినేటర్లు, పార్లమెంటు జిల్లా పార్టీ అధ్యక్షులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర అధికార ప్రతినిధులు, రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలు, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరు అయ్యారు. అంతకు ముందు ముఖ్యమంత్రి సీఎం జగన్ పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. అలాగే పార్టీ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మరోవైపు ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు హాజరుకాగా, వారందరికీ ముఖ్యమంత్రి అభివాదం తెలిపారు. అనంతరం తాడేపల్లిలోని తన నివాసానికి బయల్దేరి వెళ్లారు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

ASTROLOGY
శ్రీ శ్రీ కాణిపాకం స్వామి జ్యోతిష్యా/వాస్తు సమస్యలకు 25 సం॥రాలుగా సరైన పరిష్కారములు సూచిస్తున్నారు. అవసరమైన వారు పర్సనల్ అపాయింట్‌మెంట్ కొరకు ఈ ఫోన్ నెంబర్‌ను సంప్రదించవలెను.
9393110416

## వీఆర్‌ఓలు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రేషన్ షాపులలో ఈకేవైసీ చేయించాలి

**తహశీల్దార్ వెంకట వరప్రసాద్**



అనంతగిరి : విశాఖపట్నం జాయింట్ కలెక్టర్ వారి ఆదేశాల మేరకు నేడు అందరూ విఆర్‌వోలు, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లు మరియు ఆఫీస్ సిబ్బలకు అటెండ్ అయ్యి దగ్గర ఉండి ఇకెవైసీ లేని రేషను కార్డు సభ్యులకు కనీసం ఒక 100 మందికి ఒక డిపోకి ఇకెవైసి చొప్పున చేయించాలి. ఇది నేటికి జాయింటు కలెక్టర్ టార్గెట్. ప్రత్యేక శ్రద్ధ వహిచండి. హెచ్‌డీటీ మరియు సీనియర్ అసిస్టెంట్ ఇందుపై షెడ్యూల్ ఇవ్వండి. నేడు 5గంటలకు ప్రోగ్రెస్ రిపోర్ట్ పంపాలి. సిద్ధం చేయమని అనంతగిరి తహాశీల్ధార్ వెంకట వరప్రసాద్ తెలిపారు.

## జివియంసి అదనపు కమిషనర్(ఏడీసీ)గా బాధ్యతలు చేపట్టిన డా.వి.సన్యాసిరావు

విశాఖపట్నం : జివియంసి అదనపు కమిషనర్ (ఏడీసీ) బాధ్యతలు చేపట్టిన డా.వి.సన్యాసిరావు ఉత్తరాంధ్ర ఎస్‌సి, ఎస్‌టీ, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గంట్యాడ శంకరరావు ఆధ్వర్యంలో సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఏడీసీని కలిసిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు దనాల అమర్, పూలగపురి ఆశ, మీసాల విజయలక్ష్మి, గంట్యాడ శంకరరావు, గుర్రపు శంకర్, వీరభద్ర ఆచారి, శాంతికుమారి, బొబ్బాది అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## పీఎఫ్ సమస్యలు పరిష్కరించండి

**సీఈవో చక్రధరరావుకు వినతిపత్రం అందిస్తున్న ఎస్.రాజశేఖర్ తదితరులు**



శ్రీకాకుళం : జిల్లా పరిషత్ యాజమాన్యంలోని ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవో జి.చక్రధరరావును ఏపీటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు రాజశేఖర్ తదితరులు కోరారు. సీఈవోను ఆయన కార్యాలయంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సీఈవోను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.పాపారావు, నాయకులు టి.చలపతిరావు, బి.రవి, పి.బాలాజీరావు, బి.వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

## ఉమ్మడి బడి విధానం ఉత్తమం

రాజాం : జాతీయ విద్యావిధానం ముసాయిదా లోపాలతో నిండి ఉందని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాద్ అన్నారు. రాజాంలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో జాతీయ విద్యావిధానం-2019, అమ్మఒడి పథకాలపై సదస్సు నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రైవేటుకు అనుకూలంగా నూతన విద్యావిధానం ముసాయిదాలో అంశాలు పొందుపర్చారన్నారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించాలంటే డా. కొఠారి కమిషన్‌లో సూచించిన విధంగా ఉమ్మడి బడి(కామన్ స్కూలు) విధానాన్ని అమలు చేయడం ఉత్తమమన్నారు. అమ్మఒడి పథకం ప్రైవేటు పాఠశాలలకు వర్తింపజేయటంతో ప్రభుత్వ పాఠశాల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిన్నాల అచ్యుతరావు, కె.భానుమూర్తి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పెద్దాపురంలో ఎక్సైజ్ దాడులు



పెద్దాపురం : పెద్దాపురం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో జరిగిన దాడులలో నలుగురు ముద్దాలను, 45 లీటర్ల నాటు సారాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ ఎంఆర్‌కె.దాస్ తెలిపారు. ఈ దాడులు జగ్గంపేట, రంగంపేట, గండేపల్లి, మురారి గ్రామాలలో నిర్వహించినట్లు తెలిపారు.

ఈ దాడులలో బల్లా రాజు-మల్లిసాల, పంపన వీరగనిక-వెంకన్నపేట, బొమ్మొత్తుల ఏసు బాబు-వడిశలేరు, దాసరి రాజు కుమార్- మురారి గ్రామాలకు చెందిన వారుగా గుర్తించినట్లు తెలి పారు. దీంతో పాటు 4,200 లీటర్ల బెల్లపు ఊటను, ధ్వంసం చేసినట్లు దాస్ తెలిపారు. ఈ దాడులలో ఎంఆర్‌కె.దాస్, ఎస్సై తాతారెడ్డి, జె.విజయకుమార్, ఎస్.ఎం.సుభానీ, జి.శ్రీనివాసరావు, ఎన్.కృష్ణ ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలలో రంగులపై (ఎల్లో డే) అవగాహన




విశాఖపట్నం : విశాఖ అర్బన్-2 ప్రాజెక్టు మద్దిలపాలెం, కెఆర్‌ఎం కాలనీ-1 అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి ఆదేశాల మేరకు అంగన్‌వాడీ స్కూళ్ళను బలోపేతం చేయాలన్న ఉద్దేశ్యంతో పిల్లలలో రంగులపై (ఎల్లో డే) అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఆర్.సుబ్బలక్ష్మి మాట్లాడుతూ పిల్లలకు ఇటువంటి కార్యక్రమాలు వలన వారిలో మాన సికంగా, శారీ రకంగా, ఆరోగ్యంగా వుంటారని చెప్పడం జరిగింది.

ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## చోడవరంలో అనకాపల్లి ఆర్డీవో ఆకస్మిక తనిఖీ



చోడవరం : చోడవరం పట్టణంలోని యడ్లవీధి, అన్నవరం ప్రాంతాలలో గల 5, 9వ నెంబరు గల రేషన్ డిపోలతో పాటు మండలంలోని గోవాడ, గజపతినగరం, నర్సయ్యపేట గ్రామాలలోని పలు ప్రభుత్వ స్థలాలను అనకాపల్లి ఆర్డీవో జె. సీతా రామారావు శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.లాయన వెంట తహసీల్దారు రవికుమార్, ఆర్.ఐ లు రవి, రాంబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు వెలమ సంఘం మీటింగ్

సబ్బవరం : మండల కేంద్రంలో మేజర్ పంచాయితీలో భాగమైన కొత్త రోడ్డు దరి మర్లమాంబ గుడి వద్ద ఆదివారం వెలమ సంఘం మీటింగ్ జరుగునని వెలమ సంఘ నాయకులు మండల కేంద్రంలో తెలిపారు. ఈ మీటింగ్ ముఖ్య అతిథిగా కొటాన రాము వస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా వెలమలకు జరగుతున్న అన్యాయాల గురించి చర్చించుకుందామని వెలమలకు సముచిత స్థానం ఇవ్వడం లేదని ఎన్నో పార్టీలు వెలమలను స్వలాభాల కోసం వాడుకుంటున్నాయని వారు ఆరోపించారు. కేవలం పంచాయితీ పరిధిలో ఉన్న గ్రామాల వారు ఈ సమావేశంలో పాల్గొనాలని వారు కోరారు.

## భోగాపురంలో 12 అడుగుల కొండచిలువ హతం



హతమార్చిన కొండచిలువను చూపెడుతున్న స్థానిక యువకుడు బాలగంగాధర శ్రీనివాస్

చోడవరం : మండలంలోని భోగాపురం గ్రామంలో సుమారు 12 అడుగుల కొండ చలువను గ్రామస్తులు హతం చేశారు. స్థానిక కోపరేటివ్ సొసైటీ సమీపంలో శనివారం ఉదయం కొండచలువ స్థానికులు గమనించారు.

ఇంత పెద్ద కొండ చలువను చూసిన స్థానిక మహిళలు, చిన్న పిల్లలు భయ బ్రాంతులకు గురై పరుగులు తీశారు. దీంతో కొందరు జోక్యం చేసుకుని కొండచలువను హత మార్చారు.

## గ్రంథాలయాలు జ్ఞాన దేవాలయాలు



వనపర్తి : తెలంగాణ వికాస సమితి మూడో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సమితి జిల్లా బాధ్యులు పిలుపునిచ్చారు. ఈనెల 10న హైదరాబాద్‌లోని నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయం లోని ఆడిటోరియంలో మహాసభలు జరగనున్నాయని తెలిపారు. తెలంగాణ అస్తిత్వ, లౌకికవాద సంస్కృతి పరిరక్షణకు, సామాజిక వికాసానికి తెలంగాణ వికాస సమితి చేస్తున్న కృషిలో భాగ స్వాములు కావాలని జిల్లా బాధ్యుడు వీరయ్య పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా మహాసభల కరపత్రికలను శుక్రవారం విడుదల చేశారు. కార్యక్రమంలో తెవిస ప్రతినిధులు నారాయణ రెడ్డి, సుజాత, బాలస్వామి, పద్మావతి, శ్యాంసుందర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

**- ఉత్సాహంగా హాజరైన నిరుద్యోగ యువత హాజరు - చోడవరానికి పరిశ్రమలు తీసుకువచ్చి, పారిశ్రామికంగా తీర్చిదిద్దుతా - నిరుద్యోగులకు వృత్తి నైపుణ్యంపై శిక్షణనిచ్చి, అవకాశాలు అందిపుచ్చుకునేలా చేస్తా - ఉద్యోగమేళా ప్రారంభోత్సవంలో శాసన సభ్యులు కరణం ధర్మశ్రీ**



మెగా జాబ్ మేళా ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

చోడవరం : పట్టణంలోని ఉషోదయ విద్యా సంస్థల ప్రాంగణంలో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు నిరుద్యోగ యువతీ,యువకుల నుంచి విశేష స్పందన లభించింది. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉద్యోగమేళాను స్థానిక శాసన సభ్యులు కరణం ధర్మశ్రీ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల నిరుద్యోగ యువత భవిష్యత్తు తీర్చిదిద్దేందుకు నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి వారిని ఉద్యోగాలల స్థిరపడేలా చేయడమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు.

దీని కోసం నియోజకవర్గంలోని వెంకన్నపాలెం, దుడ్డుపాలెం, కోమళ్లపూడి ప్రాంతాలలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేసి, చోడవరంకు వివిధ రకాల పరిశ్రమలు తీసుకువచ్చి, నియోజక వర్గాన్ని పారిశ్రామికంగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తున్నానన్నారు. దీనిపై ఇప్పటికే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి నివేదించడం జరిగిందన్నారు. యువత భవిష్యత్తుకు దిశా, నిర్దేశ్యం చేసేలా వారికి శిక్షణ ఇవ్వడంతో పాటు ప్రతి మూడు నెలలకు ఒక మెగా జాబ్ మేళా నిర్వహించి వారికి ఉద్యోగ భద్రతను కల్పించేలా చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. విద్యార్థినీ, విద్యార్థులు జాబ్ మేళా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఉషో దయ విద్యా సంస్థల ఛైర్మన్ జె.నానాజీ సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాధికారి చాముం డేశ్వరరావు, రిటైర్డు తహసీల్దారు పెంటకోట అప్పలనాయుడు, వై.సి.పి, మండల అధ్యక్షులు పల్లా నరసింగరావు, పట్టణ అధ్యక్షులు పుల్లేటి వెంకటరావు, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు అల్లాడ భవానీ, బగ్గు శ్యామల, కర్రి తమ్ము నాయుడు, దొండా రాంబాబు, మూడెడ్ల శంకర్‌రావు, సూరిశెట్టి నాగదుర్గ గోవింద, ఉషో దయ విద్యాసంస్థల డీన్ ఎస్.వి. వాసు, కళాశాల అధ్యాపక బృందం, నియోజక వర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువత తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగ మేళాకు హాజరైన నిరుద్యోగ యువత

**IN THE HON'BLE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE AT : VISAKHAPATNAM**
**O.S.150/2019**

Between :
State Bank of India, RACPC-1,
Visakhapatnam, Rep. by its Manager ...Plaintiff
And
Singuri Suresh .....Defendant

**SUMMONS**

To,
**THE DEFENDANT:**
Singuri Suresh, S/o. Ammam Naidu,
Hindu, aged about 38 Years,
R/at. MIG-859, Flat No. 202, Himagiri Enclave,
Midilapuri Colony, Visakhapatnam-530045.

Take notice that the above plaintiff has filed the above suit against you before the Hon'ble II Addl. Junior Civil Judge, Visakhapatnam for recovery of amount basing upon loan agreement and the Hon'ble Court was pleased to order issuance of notice to you by way substituted service of summons i.e., paper publication as you have intentionally avoided service of notice. You are hereby summoned to appear before the above mentioned Court on **19-08-2019 at 10:30 A.M** in person or through an Advocate in the above case or else the matter will be heard and determined in your absence.

**(By Order of the Hon'ble Court)**

**K.CH.RAMA KRISHNA**
Advocate
Visakhapatnam.
**Cell:9248731466**

**IN THE HON'BLE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE AT : VISAKHAPATNAM**
**O.S.38/2019**

Between :
State Bank of India, SMEC,
Visakhapatnam, Rep. by its Deputy Manager ...Plaintiff
And
Bhupathi Ramanamma ...Defendant

**SUMMONS**

To,
**THE DEFENDANT :**
Bhupathi Ramanamma, W/o. Appa Rao,
Hindu, aged about 45 Years,
R/at. D.No. 20-91-7, Relli Veedhi,
A.V.N. College Down, Visakhapatnam-530001.

Take notice that the above plaintiff has filed the above suit against you before the Hon'ble II Addl. Junior Civil Judge, Visakhapatnam for recovery of amount basing upon loan agreement and the Hon'ble Court was pleased to order issuance of notice to you by way substituted service of summons i.e., paper publication as you have intentionally avoided service of notice. You are hereby summoned to appear before the above mentioned Court on **19-08-2019 at 10:30 A.M** in person or through an Advocate in the above case or else the matter will be heard and determined in your absence.

**(By Order of the Hon'ble Court)**

**K.CH.RAMA KRISHNA**
Advocate
Visakhapatnam,
**Cell : 9248731466**

**IN THE HON'BLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT : VISAKHAPATNAM**
**O.S.642/2018**

Between:
Sri.K.Gangabhavani & 2 others ...Plaintiffs
And
V.Satyavatamma ...Defendant

**SUMMONS**

To,
**Defendant:**
Vadamodula Satyavatamma,
W/o. Santhi Raju,Hindu, aged 67 years,
R/at. D.No.24-4-1, New Fish Market,
Visakhapatnam.

Take notice that the above named plaintiffs has filed the above suit in O.S.642/2018 against the above defendant. The Hon'ble Court has been pleased to direct you to appear in the above mentioned suit in the above mentioned Hon'ble Court either in person or by a pleader duly instructed and answer all material questions relating to the above matter on **28-08-2019 at 10:30 A.M.** in default of your appearance on the above mentioned date the suit will be heard and determined in your absence.

**(By Order of the Hon'ble Court)**

**A.SRINIVASA RAO**
**A.KAMESWARA RAO,**
**A.V.V.S.RAMA RAO**
**Advocates,**
H.B.Colony,
Visakhapatnam.

## ప్రకటన

యిందుమూలంగా యావత్‌మందికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు షేక్ అలీషా S/o. లేటు మదినా సాహెబ్ నివాసం D.No.36-95-23/2, కప్పరాడ ఏరియా, విశాఖపట్నం-8. నా క్లయింటు 25-03-2010 సం॥లో సత్యదుర్గా ప్రసాద్ గారి భార్య శ్రీమతి దున్న వెంకట పద్మావతి ద్వారా పెందుర్తి సబ్.రిజిస్ట్రారు ద్వారా Document No:1173/2010 స్థిరాస్తి క్రయ దస్తావేజు పొందియున్నారు. తేది: 05-08-2019 సం॥ కంచరపాలెం మెట్ట వద్ద Auto లో ప్రయాణం చేయుచుండగా సదరు ఒరిజినల్ డాక్యుమెంటు పోయినది. సదరు Document ఎవరికైన దొరికిన క్రింది వివరించిన అడ్రస్ వారికి తెలియజేయవలెను.

**Md.Soheb**
M.A, D.M.M.B.L
Advocate
Main Road,
Reddy Kancharapalem,
Visakhapatnam-530 008
Cell No: 9440190706

# సీపీఎం, సీపీఐ నాయకుల అరెస్టు అన్యాయం

## సీపీఎం జిల్లా కమిటి సభ్యులు రొంగలి రాము




అచ్యుతాపురం : కాశ్మీర్ లో అనారోగ్యంతో బాధ పడుతున్న సిపిఎం ఎమ్మెల్యే తరిగామి ను పరామర్శిం చడానికి వెళ్లిన సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి ,సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా లను విమానాశ్రయంలో అరెస్టు చేయడం అన్యాయమని సిపిఎం నాయ కులు రొంగలి రాము అన్నారు. శనివారం మండల కేంద్రమైన అచ్యుతా పురం నాలుగు రోడ్ల కూడలిలో సిపిఎం, సిపిఐ నాయకుల అరెస్ట్‌ను ఖండిస్తూ సిపిఎం అధ్వర్యంలో చేపట్టిన నిరసన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభు త్వం ఆర్టికల్ 360, 35 ఏల రద్దు అప్రజా స్వామికం అని దీనిని ప్రజలంతా ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కూండ్రపు సోమునాయుడు, భాస్కరరావు, వెంకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

# మరో పోరాటానికి సిద్ధం కావాలి



అంగన్వాడీ మహసభలో సిఐటియు ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు పిలుపు

**సిఐటియు ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు**

అనంతగిరి : అనంతగిరి గిరిజన సంఘం కార్యాలయంలో శనివారం అనంతగిరి అంగన్వాడీ ప్రొజేక్టు మహసభ జరిగింది ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ కార్మిక హక్కులను కాలరస్తుందని ఆయన విమర్శించారు. కనీస వేతనం 27,000 ఇవ్వా లని డిమాండ్ చేశారు బీజేపీ పార్టీకి జగన్మోహన్ రెడ్డి వత్తాసు పలుకుతోందిని ఆయన అన్నారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.మంజుల అధ్య క్షులుగా సిహెచ్ కళావతి కార్యదర్శిగా ఎస్ సుమిత్ర కోశాధికారిగా కె.పార్వతి ఉపాధ్య క్షులుగా కె లక్ష్మి జి సింహాచలం సాహయకార్యదర్శిగా కె లక్ష్మి తో పాటు 30 మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు ఈ కార్య క్రమంలో సిఐటియు నాయకులు గంగరాజు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# పంట పొలంలో మట్టి, ఇసుక, మేటలు వేసిన పొలాలను పరిశీలన





అనంతగిరి : అరకు లోయ నియోజకవర్గం శనివారం సీపీఎం రాష్ట్రకమిటి సభ్యుడు కీల్లోసురేంద్ర మండల నాయకులు ఏస్ భుర్మిసింగ్. పి.ధోన్ను మరియు పోతాంగి మాజీ సర్పంచ్ గోళ్ళూరి మోదోన పోతాంగి,తోటవాల్సో గ్రామస్తులు కె.శంకర్,గోళ్ళూరి రాంబాబు తదితరులు పోతాంగి లో ఇటీవల వాటర్ చెడ్డు ద్వారా నిర్మించిన చెరువు బారి ఎత్తున వర్షనీరు చేరి చెరువు గట్టు కొట్టుకు పోయింది చెరువు క్రింద తోటవలస, పోతాంగి గ్రామస్తులు వరి పొలాలు 20 మంది వరిపొలాలు 30 ఎకరాలు వరకు కొట్టుకు పోయింది. పొలాలులో మట్టి ఇసుక పూర్తిగా కప్పి ధ్వంసం చేసింది. ప్రభుత్వం వెంటనే స్పందించి గిరిజన రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలి. పొలాలు మట్టి పూర్తిగా కప్పుకు పోయిందని ఉపాధి హామీ పథకం ద్వారా పొలాలు బాగు చేయాలని డిమాండ్ చేయడమైనది. శనివారం గామస్తులతో స్థానిక ఆర్ ఐ.లక్ష్మిఖంత్, వీఆర్వో జన్నీకి వినతిపత్రం సమర్పించారు.

# అంగన్వాడీ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ




నర్సీపట్నం : అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) విశాఖ జిల్లా 8వ మహా సభ లను విజయవంతం చేయా లని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం.నాగశేషు కోరారు. శనివారం నర్సీ పట్నంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ ఐసి డిఎస్ పరిరక్షణ కోసం ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ఐసిడిఎస్ సంస్థను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సేవ్ ఐసిడిఎస్ నినాదంతో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పని చేస్తుందన్నారు. యూనియన్ జిల్లా మహాసభలు ఈ నెల 18, 19 తేదీల్లో జరుగుతాయని చెప్పారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ప్రాజెక్టు గౌరవ అధ్యక్షులు కె.మంగతాయారు, అధ్యక్షులు సిహెచ్.భ్రమరాంబ, కార్యదర్శి వి.సామ్రాజ్యం, సిఐటియు నాయకులు డి.సత్తిబాబు, నాగమల్లి, పర్వీన్, కృష్ణవేణి, జిల్లా నాయకులు ఎన్.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణలక్ష్మి పూజలు



విశాఖపట్నం : ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు, ఆంధ్రుల ఆరాధ్యదైవం, సౌభాగ్య ప్రదా యిని అయిన విశాఖ నగ రంలో గల శ్రీ కనక మహా లక్ష్మి అమ్మవారి దేవస్థానంలో 'శ్రావణ మాసం' సందర్భంగా శ్రీ లక్ష్మి పూజలు ప్రారం భించి నేటికి 9వరోజుకు చేరినవి. గత 14 సంవత్సరా లుగా అత్యంత ప్రతిష్టా త్మకంగా ఈ లక్ష్మి పూజ లను నిర్వహించుట జరుగు చున్నది. ఉదయం 8 గంట లకు వేదమంత్రముల మధ్య నాదస్వర సుస్వరాలు మధ్య శ్రీ లక్ష్మి పూజలు ప్రారం భించారు. 30మంది ఉభయ దాతలు స్వయంగా పాల్గొన్నారు. మరియు పోస్టుల ద్వారా భక్తుల పేరున పూజ నిర్వహించి వారికి కుంకుమ, అమ్మవారి యంత్రము, ప్రసాద ములు పంపుట జరిగినది. ఈ పూజకు కావల సిన పూజా సామగ్రి దేవస్థానం వారే సమ కూర్చే దరు. పూజ రుసుము రూ.400లు. ఈ కార్య క్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వహణా ధికారి వి.రాంబాబు, ఏ.త్రిమూర్తులు, వేద పండితులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వ వైఫల్యం

## తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ళ



అమలాపురం : వరద బాధితు లను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫల మైందని తూర్పుగోదావరి జిల్లా తెలుగు యువత కార్య నిర్వాహక కార్యదర్శి బోళ్ళ వెంకట రమణ విమర్శించారు. గోదా వరి వరద తీవ్రతను ముందుగా అంచనా వేయడంలో వైఫల్యం వల్ల లంక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయలేక పోయారని అన్నారు. రాజోలులో శనివారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ వరద తాకిడితో లంక గ్రామాలకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోనసీమలో అప్పనపల్లి, ముక్తే శ్వరం, కనకాయలంకల వద్ద కాజ్ వేలపై వరద ఉధ ృతి అధికంగా ఉండడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. కాజ్ వేల వద్ద తగిన భద్రతా చర్యలు తీసుకోనందున అప్పనపల్లి కాజ్ వే వద్ద ఇద్దరు మృత్యువాత పడ్డారని పేర్కొన్నారు.

వరద కుటుంబాలను తక్షణమే ఆదుకోవాలని, మ ృతుల కుటుంబాలకు రూ.10లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని వెంకట రమణ డిమాండ్ చేశారు.

# ఇసుక తెచ్చిన తంట

## ప్రతిదినం పెరుగుతున్న కార్మికుల మంట

పెద్దాపురం : ప్రభుత్వాలు మారితే పేద ప్రజలకు బ్రతుకుపై భరోసా కలుగుతుందన్న నమ్మకంతో, అధికారంలోకి రావడానికి రాజకీయ నాయకుల వాగ్దానాలను నమ్మి ప్రజలు ఓట్లు వేసి అధికారం కట్టబెడతారు.

ఈ నేపధ్యంలో చంద్రబాబు పాలనకు, చరమగీతం పాడి, జగన్మోహన్‌రెడ్డికి అధికారం కట్టబెట్టిన తరువాత, ప్రతిదినం కూలి పనులు చేసుకొని పొట్ట పోషించుకొనే భవన నిర్మాణ కార్మికులు, గత రెండు నెలల నుండి ఇసుక దొరకక, కూలి లేక, కాలిన కడుపుతో జీవనం సాగిస్తున్నామని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో ఆశతో 'కావాలి జగన్-రావాలి జగన్' అని ఎదురుచూసిన మాకు ప్రకృతి సిద్ధమైన ఇసుక సరఫరాపై ఆంక్షలు విధించడంతో, నిర్మాణాలు పనులు లేక కుటుంబాలు నిరాశ, నిస్పృహలతో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు లేకపోయిన, గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'అన్న క్యాంటీన్' తొలగించడం వలన, తాత్కాలిక బ్రతుకు తెరువు కూడా కోల్పోయామని, కుటుంబ పోషణ చేయలేక భార్య, పిల్లలు పస్తులుండవలసిన పరిస్థితి వుందని అంటున్నారు.

ప్రభుత్వం వెంటనే ఇసుకను అందరికి అనువుగా, అందు బాటులోకి తెచ్చి దిన, దినం కూలి బ్రతుకులైన భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని పెద్దాపురం కార్మికులు కోరుతున్నారు.

# కోపరేటివ్ అధ్యక్షునిగా మోపాడ అప్పారావు నియామకం



సబ్బవరం : దుర్గమాంబ సహకార సంఘం అధ్యక్షునిగా మోపా అప్పా రావు నియామకం ఈ నియామకం జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అధీప్ రాజ్ నియమించారు. మండల కేంద్రంలో ఉన్న కో-ఆపరేటివ్ బ్యాంకులో శనివారం కో-ఆపరేటివ్ సబ్ రిజిస్ట్రార్, జిల్లా బిసి సెల్ అధ్య క్షులు కొటాన రాము చేతులు మీదుగా సొసైటీ అధ్యక్షులు మోపాడ అప్పారావును నియమించారు. ఉపాధ్యక్షులుగా బొడ్డేటి మహలక్ష్మి నాయుడు, డైరెక్టర్‌గా సబ్బ వరపు నాగభూషణంను నియమించారు. వీరు నియామకం అనం తరం రాష్ట్ర ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే ఎమ్మెల్యే అధీప్‌రాజ్‌కు తమ కృతజ్ఞతలు తెలియజేశారు. సొసైటీలో తమ బాధ్యత సక్రమంగా నిర్వ హిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తుంపాల అప్పారావు, కోపరేటివ్ సొసైటీ సిఈఓ గొంప రమణ, వైకాపా పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న అన్నమాచార్య సంకీర్తన గానం

విశాఖపట్నం : అన్నమయ్య పదకోకిల పద్మశ్రీ డాక్టర్ శోభారాజ్ స్థాపించిన అన్నమాచార్య భావనా వాహిని విశాఖ నగర శాఖ ఆధ్వ ర్యంలో రామ్‌నగర్ మెయిన్‌రోడ్డు దరి శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో నిర్వహించిన అన్నమాచార్య సంకీర్తన గాత్రకచేరి ఆహూతులను ఆకట్టుకుంది.

నగరానికి చెందిన ప్రముఖ గాయకుడు డా॥ వై.బాల గణేష్ వారి శిష్యబృందం అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించి విచ్చేసిన భక్తజనుల మన్ననలను పొందారు. సంకీర్తనా కార్యక్రమానికి తబలాపై హరివంశీ, తాళంపై ఎం.వెంకటరాజశేఖర్‌లు సహకరించారు. దీనికిముందు సాము హికంగా శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించినాము. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కో-ఆర్డినేటర్ ఎ.పి.ఎస్.మూర్తి, ప్రోగ్రామ్ కన్వీనర్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, కో-కన్వీనర్లు జె.సోమయాజులు, భాస్కరరావు, మఠం మేనేజరు పవన్ కుమార్ ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

# వరదల కారణంగా రేపటి వరకు గడువు పెంచిన ప్రభుత్వం



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టబోతున్న గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగాల దరఖాస్తు గడువు పెంచుతున్నట్లు మున్సిపల్ శాఖ ప్రకటించింది. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. వరదల కారణంగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలోని అభ్యర్థులు గడువు పెంచమని కోరారని అధికారులు తెలిపారు. వారి అభ్యర్థన మేరకు దరఖాస్తుల గడువును ఈ నెల 11 (రేపు ఆదివారం) అర్థరాత్రి 12గంటల వరకు పెంచుతున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ క్రమంలో 13 జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాలకు అభ్యర్థులు ఆదివారం రాత్రి 12 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఏపీ ప్రభుత్వం రికార్డు స్థాయిలో 1,26,728 ప్రభుత్వోద్యోగాల భర్తీకి నిర్వహించే రాతపరీక్షకు దరఖాస్తులు వెల్లువలా వచ్చిపడుతున్నాయి. శనివారం సాయంత్రం నాటికి 21 లక్షల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. మరోక రోజు గడువు పెంచడంతో 22 లక్షల వరకు దరఖాస్తులు వస్తాయని అధికారులు భావిస్తున్నారు. మొత్తం 19 రకాల ఉద్యోగాలను నాలుగు రకాలుగా వర్గీకరించి.. వాటికి సెప్టెంబరు 1, 8 తేదీలలో ఉదయం, సాయంత్రం రెండు పూటలా వేర్వేరుగా రాతపరీక్ష నిర్వహించనున్న సంగతి తెలిసిందే.

# సిపియం, సిపిఐ ప్రధాన కార్యదర్శులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నాం

## సిపియం జిల్లా కమిటీ సభ్యులు గండి నాయనిబాబు




సబ్బవరం : జమ్మూ-కాశ్మీర్‌కు ఉన్న స్వయం ప్రతిపత్తి ప్రత్యేక హెూదా కల్పిస్తున్న 370 ఆర్టికల్‌ను 35ఏ రద్దు చేసి ప్రజలు హక్కుల మీద దాడులు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కేంద్ర ప్రభుత్వం సిపియం, సిపిఐ నాయకులు సీతారామ్ ఏచూరి, డి.రాజులను అరెస్టు చేసి నిర్భందించడాన్ని దీన్ని సబ్బవరం సిపియం నాయకలు తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. మండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలిలో సిపియం నాయకులు ఆధ్వర్యంలో శనివారం నిరసనలు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపియం జిల్లా కమిటీ సభ్యుడు గండి నాయనిబాబు పాల్గొని ఆయన మాట్లాడుతూ బిజెపి కేంద్ర ప్రభుత్వం కాశ్మీర్ విమానాశ్రయంలో సిపియం, సిపిఐ ఆలిండియా కార్యదర్శులను అక్రమంగా అరెస్టులు చేసి నిర్భందించడాన్ని దీన్ని మేము ఖండిస్తున్నామన్నారు. ప్రత్యేక హెూదా కోసం పోరాటం చేసిన నాయకులు అరెస్టు చేయడాన్ని ఖండిస్తునామని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో మండల కార్యదర్శి యు.సత్యవతి, ఎమ్.గౌరీష్, ఎన్.వెంకటరమణ, ముఠా కార్మికులు పంచాయితీ కార్మికులు బండమ్మ, కోటి, అప్పారావు, పెంటారావు తది తరులు పాల్గొన్నారు.

# ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అన్నదానానికి లక్ష విరాళం



భీమునిపట్నం: భీమిలి తగరపువలస రోడ్ లో ఉన్న ఐశ్వర్య వెంకటేశ్వరస్వామి దేవాలయం లో ప్రతీ శనివారం అన్నదానానికి కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ట్రస్ట్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి శనివారం ఆలయ ట్రస్ట్ బోర్డు చై ర్మన్ కె ఎస్ ఎన్ మూర్తికి లక్షల రూపాయల చెక్ ను అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల పదిహేను న కుమార్తె స్నిగ్ధ శ్రీ జయంతి సందర్భంగా ఈ విరాళం అందజేశామని తెలిపారు. ఆ రోజు సుమారు మూడు వందల మందికి అన్నదానం జరుగుతాదని. ప్రతి శనివారం ఆలయం లో మద్యాహ్నం అన్నదానం నిర్వహిస్తామని తెలియజేశారు.ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కె ఎస్ ఎన్ మూర్తి మాట్లాడుతూ ఈ అన్నదానం ఎవరైనా విరాళం ఇవ్వవచ్చని, పెళ్లిరోజు, పుట్టినరోజులకు దేవాలయం లో అన్నదానం కి మూడువేలు విరాళం అందజేస్తే వారి పేరున అన్నదానం చేస్తామని తెలిపారు. హైదరాబాద్ కి చెందిన పి.వి. రావు రెండు సంవత్సరాలు పాటు ప్రతీ శనివారం అన్నదానం చేయడానికి విరాళం అందజేసారని అన్నారు.

ఈ కార్యక్రమం లో ట్రేజరర్ వుసిరికల తాతాజీ,ట్రస్ట్ సభ్యులు బాల మురళీ, సూర్యనారాయణ మూర్తి, క్లబ్ శ్రీను , తదితరులు పాల్గొన్నారు.

# క్లబ్ సర్వీస్‌ద్వారా సమాజసేవకు శ్రీకారం : డా. రావు

## ఘనంగా భూపేంద్రను సత్కరించిన రొటేరియన్లు - ఆకట్టుకున్న వికాస్ పెయింట్స్ డెమో

కాకినాడ: రోటరీ గోల్డెన్ జూబ్లీ మెంబర్‌షిప్ మంత్‌ను క్లబ్ సభ్యులు వినూత్నరీతిలో ఘనంగా నిర్వహించు కున్నారు. మెండర్‌షిప్ కమిటీ ఛైర్మన్ లంకసాయిబాబా స్వీయ పర్యవేక్షణలో సమావేశం రెండుగంటలపాటు శనివారం జరిగింది. క్లబ్ అధ్యక్షులు డా. సతీష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏషియన్ పెంయింట్స్ ప్రధాన పంపిణీదారులు వికాస్ పేయింట్స్ షోరూమ్ అధినేత పి.వి. సత్యన్నారాయణ (పెదబాబు) పేయిం టింగ్ రంగంలో వచ్చిన వినూతన్న ప్రగతిని డెమోద్వారా వివరించినతీరు సభ్యులను విషేషంగా ఆకట్టుకుంది. కాలానుగుణంగా పేయింటింగ్‌రంగంలో వస్తున్న అనేక డవలప్‌మెంట్ అంశాలను వివరిస్తూ ప్రజలకు అవసరమైన అహల్లాదకరమైన రంగులతో ఆయాగృహాల అలంకరణ కార్యక్రమం చేసిన విధానాన్ని పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ద్వారా వివరించారు. శతాబ్దికాల ప్రగతికలిగిన తూర్పుగోదావరి జిల్లా కలక్టర్ కార్యాలయానికి తాము రంగులను అద్భుతంగా వేసిన తీరునుకూడా వివరించారు. క్లబ్ పూర్వాద్యక్షులు భూపేంద్ర డి.పరేక్ ను ముఖ్యఅతిధిగా పాల్గొన్న డా. ఎస్.వి.ఎస్.రావు ఘనంగా సత్కరించగా గజమాలతో క్లబ్ అధ్యక్షులు డా. సతీష్, కార్యదర్శి అజయ్‌రెడ్డి, డా. ముత్తానవీన్‌లు ప్రత్యేకంగా సత్కరించారు.

ముఖ్యఅతిధిగా పాల్గొన్న రెండు రాష్ట్రాల యురాలజీసంఘ అధ్యక్షులు డా. ఎస్.వి.ఎస్.రావు మాట్లాడుతూ క్లబ్‌సర్వీస్‌ద్వారా సమాజానికి ఉత్తమసేవలు అందించడానికి దోహద పడుతుందని చెప్పారు. క్లబ్‌సర్వీస్‌లో సభ్యులమధ్య పరస్పరస్నేహభావం, వారివారి వృత్తులద్వారా సమాజానికి ఏవిధంగా సేవలు అందించాలన్న అంశంతోపాటు రోటరీ నియమనిభందన లను అనుసరించడానికి తొలిమెట్టుగా వివరించారు. అంతర్జాతీయ రోటరీలో సేవలకు ప్రధాన పాత్రఉన్నప్పటికి క్లబ్‌సర్వీస్‌ద్వారా సభ్యులలో వాటిని వివరించడం తద్వారా అమలుచేయడం వంటి అంశాలవల్ల రోటరీ గౌరవం మరింతగా పెరుగుతుందని చెప్పారు. సమాజానికి అవసరమైన సేవాకార్యక్రమాలు అందించడానికి ఉత్తమమైన వేదిక రోటరీ అని అదేవిధంగా క్లాసిఫికేషన్ ఆధారంగా సభ్యులను చేర్చుకునే అవకాశం ఉందని అయితే ఒకవిభానికి చెందిన పలువురువ్యక్తులను సభ్యులుగా అవకాశం కల్పిస్తున్నప్పుడు ఆవిభాగానిక ిచెందిన సభ్యుని అంకీకారంతో సభ్యత్వఇస్తే భవిష్యత్తులో వృత్తిపరమైన విభేదాలు తలెత్తేఅవకాశం ఉండదని చెప్పారు. సమావేశాలకు తప్పనిసరిగా సభ్యులు హాజరుకావాల్సివుంటుందని తద్వారా సభ్యులందరిలో ఐక్యతపెరిగే అవకాశం ఉంటుందని చెప్పారు.

క్లబ్ అధ్యక్షులు డా. సతీష్ మాట్లాడుతూ రోటరీ గోల్డెన్ జూబ్లీ నిర్వహిస్తున్న సేవాకార్యక్రమాల విజయ వంతానికి సభ్యులుఅందిస్తున్న సహకారమే అందుకు నిదర్శనమని చెప్పారు. ప్రతీనెల రెండు సమావేశాల తోపాటు ఔట్‌డోర్ సేవాకార్యక్రమాలను నిర్వహించాలన్న తమ ప్రణాళికను అమలుచేయడానికి సభ్యులు అందిస్తున్న




చేయూతపట్ల ధన్యవాదాలు తెలుపు కున్నారు.

సన్మానగ్రహీత భూపేంద్ర మాట్లాడుతూ తమకుటుంబం సేవా రంగంతో ముడిపడిఉందని గుర్తుచేసు కున్నారు. రోటరీ గోల్డెన్‌జూబ్లీలో సభ్యునిగా చేరడంద్వారా ఆ సేవా అభిలాషను కొనసాగించే అవకాసం దక్కిందన్నారు. తన హయాంలో అనేక సేవాకార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని గుర్తుచేసు కన్నారు. రోటరీ బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటుకు జరిగిన సన్నాహక సమావేశంలో ఆనాడు పాల్గొనడంద్వారా నేడు బ్లడ్ బ్యాంక్ సేవలు అనేక జిల్లాలకు విస్తరించబడిఉండడం గొప్పవిషయంగా వివరించారు. కార్యక్రమంలో కోశాధికారి నల్లమిల్లి మాచారెడ్డి, పేపకాలయ రామకృష్ణ, చిక్కంరామచంద్రరావు, టేకుమూడి సూర్యనారాయణ, వెత్సాఆనంద్, బ్లడ్‌బ్యాంక్ చైర్మన్ పెదగాడి వెంకటరమణ, కార్యదర్శి ధనసాగరి ప్రసాద్, కొంగరివెంకటేశ్వరరావు, ఉదయభాను, సోని, బుజ్జి, జి. సత్యమూర్తితోపాటు పలువురు పాల్గొన్నారు.

# పుష్కర కాలువ నుండి పంపా రిజర్వాయర్‌కు శాశ్వతముగా నీరు విడుదల చేయాలి ఎమ్మెల్యే పర్వత

[redacted]



అన్నవరం: తూ.గో.జిల్లా అన్నవరం స్దానిక పంపా రిజర్వాయర్ నుండి తుని నియోజకవర్గం తొండంగి మండలానికి నీరు విడుదల చేయడానికి వచ్చిన ప్రభుత్వ విప్ దాడిశెట్టి.రాజా,ప్రత్తిపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే పర్వత.పూర్ణచంద్ర ప్రసాద్ లకు ఇరిగేషన్ అధికారులు, రైతులు మంగళ వాయిధ్యాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వీరు పంపా రిజర్వాయర్ నుండి నీటిని విడుదల చేసారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పర్వత. పూర్ణచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఈ పంపా ప్రాజెక్టు ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఉన్నప్పటికీ తుని మండలంలోని పలు గ్రామాల రైతులకు నీటి కొరత లేకుండా వారి అవసరాలకు ఉపయోగపడుతుందని,అయితే ఈ రిజర్వాయర్ పూర్తిగా వర్షాధారణతో ముడిపడి ఉండడం వలన ఆయా గ్రామాల రైతులకు కొన్ని సమయాలలో నీటి కొరత ఇబ్బంది ఎదుర్కొంటు న్నారని తెలిపారు.అయితే ఈ సందర్భంగా రైతుల ఎదుర్కొంటున్న నీటి సమస్యపై ముఖ్యమంత్రి ద ృష్టికి తీసుకొని వెళ్లి దీని శాశ్వత పరిష్కారముగా ఈ పంపా రిజర్వాయర్ ప్రాజెక్టు కు పోలవరం,పుష్కర కాలువ కెనాల్ నుండి శాశ్వత ప్రతిపదికన చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో రైతులు స్దానిక వైసీపీ నాయకులు శెట్టిబత్తుల.కుమార్ రాజా,కొండపల్లి. అప్పారావు, బివిస్వీ.ప్రసాద్, తాటిపాక.క ృష్ణ, అల్లాడ. సూరిబాబు, దడాల.సతీష్,ధారా. వెంకట రమణ, బొబ్బిలి. వెంకన్న,బండారు. అర్జునరావు, మెరపల. చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# అవగాహన లేని ఇరిగేషన్ అధికారులు




అన్నవరం: తూ.గో.జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరం గ్రామమునకు చేర్చి ఉన్న పంపా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం(105అడుగులు ) 99 అడుగుల నీటి మట్టానికి నీటి విడుదలకు అత్యుత్సాహం చూపిన ఇరిగేషన్ అధికారులు.అధికారుల తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.దేశం భ్రమలో పనిచేస్తున్న పంపా దిగువ స్థాయి సిబ్బంది. సంవత్సరానికి ఇద్దరు చొప్పున మారుతున్న ఇరిగేషన్ ఏఈలు.ఏఈలను సైతం కిందిస్థాయి సిబ్బంది కర్ర పెత్తనం చేసే వరకు వెళ్ళడం వల్లే భయంతో బదలీ లపై వెళ్లిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.పంపా ఆయకట్టు విస్తీర్ణం 20 వేల ఎకరాలు కాగా ప్రధాన కాలువకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయకపోవడం,పలు చోట్ల పంపా కిందిస్థాయి సిబ్బంది భరోసాతో ప్రధాన కాలువకు చాలాచోట్ల అక్రమంగా తూరలు ఏర్పాటు చేయడం జరిగింది.దీనిపై పూర్తి స్థాయిలో ఇరిగేషన్ ఉన్నతాధికారులు తక్షణం స్పందించకపోతే శివారు ప్రాంతానికి నీరు అందలేని పరిస్థితి నెలకొంటుందని తొండంగి మండల శివారు ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# 2వ వార్డులో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అదనపు తరగతులు

భీమునిపట్నం: తగరపువలస రెండవ వార్డు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అదనపు తరగతులు సోమవారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి.శ్రీనివాసరావు ప్రారంభిస్తారు.

ఆ కార్యక్రమం ఏర్పాట్లు పర్యవేక్షించిన భీమిలి నియోజకవర్గ ప్రతినిధి ముత్తంశెట్టి మహేష్ మరియు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ రావు, భీమిలి జోనల్ కమిషనర్ గోవిందరావు, మరియు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జీరు.వెంకట రెడ్డి,బాస్కర్ రెడ్డి, ఉప్పాడ.నాగేశ్వరరావు, సుజాతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన వనదుర్గమ్మ వారి శ్రావణ మాసోత్సవాలు



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వనదేవతగా పూజలు అందుకొంటున్న వనదుర్గమ్మ వారి ఆలయంలో శనివారం నుండి ఆరు రోజులు వరకు జాతర మహోత్సవములు నిర్వహిస్తారు,ఈ మహోత్స వాలలో భాగంగా శనివారం అమ్మవారి ఆల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రతి రోజూ వివిధ రూపాలలో అలంకరించి చండీ హెూమా లు,కుంకుమ పూజలు మరియు విశ్లేష పూజలు నిర్వహిస్తారు. సుమారు 44 మంది రుత్వికులు దీక్ష వస్త్రాలు ధరించి పూజలో పాల్గొంటారు.ఈ ఆరు రోజుల్లో వరుసగా, బాల అమ్మవారు, సరస్వతి అమ్మవారు, అన్నపూర్ణ దేవి అమ్మవారు, మహాలక్ష్మి అమ్మవారు,వారాహి దేవి అమ్మవారు, మరియు రాజేశ్వరి దేవి అమ్మవారు లుగా అలంకరించి పూజలు నిర్వహిస్తారు. అనంతరం చివరి రోజు పూర్ణాహుతి కార్యక్రమం మరియు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ పూజ కార్య క్రమంలో దేవస్థానం ఈవో ఎం.వి.సురేష్ బాబు, ఛైర్మెన్ ఐ.వి.రోహిత్, ఏసి రమేష్ బాబు, దేవస్థానం అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పేలిన పెట్రోల్ ట్యాంకర్: 60 మంది మృతి

టాంజానియా: టాంజానియాలో విషాద సంఘటన చోటు చేసుకుంది. పెట్రోల్ ట్యాంకర్ పేలడంతో జరిగిన ప్రమాదంలో 60 మంది సజీవ దహనం కాగా, 70 మంది తీవ్రంగా గాయపడ్డారు. మారాగోరా రిజియన్‌లోని పోర్టు పట్టణమైన దర్ ఈస్ సలమ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. గత నెలలో నైజీరియా నార్తన్ బెన్యూ స్టేట్‌లో పెట్రోల్ ట్యాంకర్ పేలి 45 మంది మ ృతి చెందారు. మే నెలలో జరిగిన పేలుడులో నైజీరియా రాజధాని నైమీలో జరిగిన ప్రమాదంలో 80 మంది మ ృతి చెందారు. ఈ రూట్‌లో గత ఐదు సంవత్సరాల్లో 203 మంది మ ృతి చెందినట్లు అధికారులు తెలిపారు.

# ఎస్పీ బాలు సంగీత సేవాట్రస్ట్ ప్రారంభం

## ' మదిని దోచిన మేడలో చేరిన చిలకమ్మా.. సంగీత విభావరి



విశాఖపట్నం : మధుర గీతాలు ప్రేక్షకుల్ని ఊహాలోకంలో విహరింప జేశాయి. ఏరిన ముత్యాల్లాంటి మేటి సినిమా పాటు రసహృదయాను మీటాయి. ఎస్పీ సంగీత సేవా ట్రస్ట్ ఆవిర్భావ సభ శనివారం సాయంత్రం సంగీత ప్రియు మనోఫకాపై మధుర సంతకం చేసింది. వర్థమాన గాయిని, వ్యాఖ్యాత ఎం. రమణి, చెన్నా ధనరాజ్ కుమార్ వ్యవస్థాపక అధ్యక్ష కార్యదర్శుగా అంకురించిన ఈ సంస్థ ఆవిర్భావ సందర్భంగా మేడలోని చికమ్మా... పేరుతో ఏర్పాటు చేసిన సినీ సంగీత విభావరి ప్రేక్షకుల్ని ఆద్యంతం మంత్రముగ్ధుల్ని చేసింది. జయహే నీలిమేఘ శ్యామ.., ఎచటికోయీ నీ పయనం..., మేడలో చేరిన చికమ్మా... వంటి నిత్యనూతన గీతాకు ఆడిటోరియంలో చప్పట్లు మార్మోగాయి. సనసన నీవుంటే... పాటను చింపల్లి సత్యనారాయణ, ఇందిరా సాహిణి చక్కగా ఆపించారు. ఆకాశం దించాలా.. గీతం సుమతి, కోటేశ్వర్రావు గళంలో చక్కగా ఒదిగిపోయింది. జాస్మిన్ పాడిన ఆకులో ఆకునె%... పాట మెచ్చుగోగా సాగింది. కేవీ సురేష్ గళంలోచి మార్థవంగా జువారిన నవరస సుమ మాలిక... ప్రత్యేక ప్రశంసందుకుంది. సిన్నీ సిన్నీ కోరికడగ..., కహంస నడకదానా... వంటి పాత కొత్త మే కయికగా ఈ విభావరి అన్ని వయస్సు ప్రేక్షకు మన్ననందుకుంది. సీహెచ్ సోమేష్ కీబోర్డుపైన, ఏవీచం తబలా పైన, బాబ్జీ ప్యాడ్స్ పైన, ఎలిశెట్టి రామ్మోహనరావు కాంగోపైన, పూర్ణ చంద్రరావు గిటార్‌పైన చక్కటి సంగీత సహకారంతో కార్యక్రమాన్ని రక్తికట్టించారు. ప్రముఖ వ్యాఖ్యాత భీశెట్టి వెంకటేశ్వరరావు తన గంభీరమైన గళంతో సందర్భోచితమైన చనచిత్ర విశేషు, రసప్ఫోరకమైన సంగతుతో కార్యక్రమాన్ని ఆద్యంతం ఆసక్తికరంగా నడిపించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం పొందిన ప్రముఖ వాద్య సంగీత కళాకారుడు ఎలిశెట్టి రామ్మోహన రావు(గరివిడి రాంబాబు)ను నిర్వాహకు తరపున ముఖ్య అతిథిగా హాజరైన వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్, విశిష్ట అతిథిగా పాల్గొన్న ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. కృష్ణ మోహన్, గౌరవ అతిథు కొయ్యు ప్రసాదరెడ్డి, జాలాది విజయ, షేక్ అంజాద్ ఆలీ, వి. విజయ రమణి, కొణతా రాజు తదితయి ఘనంగా సత్కరించారు. ఘంటసా స్పోర్ట్స్ అండ్ క్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమ రావు కార్యక్రమ సమన్వయకర్తగా వ్యవహరించారు.

# ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం దిశగా : మీ సేవ రద్దుకు ప్రతిపాదనలు : అమలైతే..!

విజయవాడ: ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటి వరకు పౌర సేవలు అందించటంతో కీలక పాత్ర పోషిస్తున్న మీ సేవ కేంద్రాలను రద్దు చేసే ప్రతిపాదన అధికారులు సిద్ధం చేసారు. దీనికి సంబంధించి ముఖ్యమంత్రి జగన్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఏపీ ప్రభుత్వం అక్టోబర్ రెండో తేదీ నుండి గ్రామ సచివాలయాలను ప్రారంభిస్తోంది. దీని ద్వారా అన్ని రకాల పౌర సేవలను అందించాలని ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. దీంతో..మీ సేవ కేంద్రాలు అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. మీ సేవా కేంద్రాలు రద్దు అయితే అందులో పని చేస్తున్న ఉద్యోగులు రోడ్డున పడనున్నారు. దీని పైన మీ సేవ ఉద్యోగులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్ దీని పైన ఎటువంటి నిర్ణయం తీసుకుంటారనేది ఆసక్తి కరంగా మారింది. ఏపీ ప్రభుత్వం కొత్త ఆలోచన చేస్తోంది. ఇప్పటి వరకూ వివిధ రకాలైన పౌర సేవలను అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్న మీ సేవ కేంద్రాలను రద్దు చేసే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. అక్టోబరు 2నుంచి గ్రామ సచివాలయాలు అందుబాటులోకి రానుండటంతో ఈ నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. మీ సేవలో అందించే పౌర సేవలన్నీ ఇక మీదట గ్రామ సచివాలయాల నుంచి అందేలా చర్యలు చేపట్టనున్నారు. అధికారులు ఇప్పటికే ఈ దిశగా ప్రతిపాదనలు సిద్ధం చేసి..ముఖ్యమంత్రి అభిప్రాయం కోసం ఎదురు చూస్తున్నారు. రద్దు చేసే మీ సేవ కేంద్రాల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే అర్బన్ మీ సేవ కేంద్రాలు ఉంటాయా.. లేక ఫ్రాంఛైజీల ద్వారా నడిచే మీ సేవ కేంద్రాలు ఉంటాయా అనే విషయంపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది. ఏపీలో 2003 లో మీ సేవ కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. తొలుత నాలుగు రకాల సేవలతో ప్రారంభమైన మీ సేవ నేడు 367 రకాల ప్రభుత్వ సేవలు, మరో 30 రకాల ప్రైవేటు సేవలు అందిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 11,054 కేంద్రాలకు దశల వారీగా ప్రభుత్వం అనుమతిలిచ్చింది.

ఇందులో రెండువేలకు పైగా మీ సేవలు పనులు లేక నిరుపయోగంగా మారడంతో మూతబడ్డాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే అర్బన్ మీ సేవ కేంద్రాలు సుమారుగా 200 వరకు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఫ్రాంఛైజీల కింద 9,020 మీ సేవ కేంద్రాలు పౌరులకు సేవలందిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రైవేటు ఏజెన్సీల గడువు ముగియడంతో కార్పొరేట్ కంపెనీలకు మీ సేవ సాఫ్ట్‌వేర్ అగ్రిమెంట్లను బదిలీ చేయవచ్చని భావిస్తున్న తరుణంలో గ్రామసచివాలయాల ద్వారా పౌర సేవలందించేందుకు ప్రభుత్వం మొగ్గు చూపినట్లు సమాచారం. మీ సేవలో అందించే పౌర సేవలను కేటగిరీల వారీగా విభజించారు.

రెవెన్యూ సేవల్లో ఎ కేటగిరీ కింద అందించే 15 రకాల సేవలను దరఖాస్తు చేసుకున్న 15 నిమిషాల్లో ఆందుకు అవసరమైన సర్టిఫికెట్లు ఇవ్వడం జరుగుతుంది. ఇందులో ముఖ్యంగా వ్యవసాయ భూములకు సంబంధించిన నీటి తీరువా బిల్లులు, మంచినీటి కుళాయి పనులు, రెసిడెన్సీ సర్టిఫికెట్లు, ఇన్కమ్ ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ సర్టిఫికెట్లు లాంటివి ఉన్నాయి. మీ సేవా కేంద్రాల్లో కేటగిరి -బి కింద సింగిల్ విండో ల్యాండ్‌కన్వర్షన్, డాటెడ్ ల్యాండ్స్, టూటిల్ డీడ్, టైటిల్ డీడ్ కమ్ పాస్‌బుక్, ఈడబ్ల్యుఎస్ సర్టిఫికెట్లు, ఆదాయ ధ ృవీకరణ పథకం, నో ఎర్నింగ్ సర్టిఫికెట్స్, పాన్‌బ్రోకర్, అడంగల్ కంప్యూటరైజ్డ్ అడంగల్ 1బి, ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్, సర్టిఫైడ్ కాపీస్ ఇష్యూడ్ బై ఆర్డీఓ, కుటుంబ సభ్యుల వివరాలతో కూడిన సర్టిఫికెట్లు, మ్యాన్యువల్ అడంగల్, ఓబిసి, ఈబిసి, నో ఎర్నింగ్ సర్టిఫికెట్లు, వ్యవసాయం ద్వారా వచ్చే ఆదాయానికి సంబందించిన సర్టిఫికెట్లు, ఈ పాస్‌బుక్ రీ-ప్లేస్‌మెంట్, ఈ -పాస్‌బుక్ డూప్లికేట్, సినిమా లైసెన్స్ రెన్యూవల్స్, లోన్ ఎలిజిబిలిటీ కార్డు(ఎల్ఇసి), పట్టా సబ్ డివిజన్ లాంటి కీలకమైన సేవలన్నీ మీ సేవ ద్వారానే దరఖాస్తు చేసుకునే విధంగా ప్రభుత్వం అనుమతులిచ్చింది.

# ఘనంగా గీతం 39వ వ్యవస్థాపక దినోత్సవం

## డాక్టర్ కీ.శే. ఎమ్.వి.వి.ఎస్. మూర్తి విగ్రహావిష్కరణ .. అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



### డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్. మూర్తి కాంస్య విగ్రహావిష్కరణ

గీతం వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్. మూర్తి విగ్రహాన్ని గీతం ప్రాంగణంలో ముఖ్యఅతిధిగా హాజరైన భారత రత్న ప్రణబ్ ముఖర్జీ ఆవిష్కరించారు. పార్లమెంట్ సభ్యుడుగా ఉన్న సమయంలో డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్.మూర్తి ప్రజా సమస్యలను లేవనెత్తటంతో పాటు మంచి నడవడికతో ఆదర్శంగా నిలిచారని కీ.శే. ఎంవివిఎస్ మూర్తిని కొనియాడుతూ నివాళులు అర్పించారు.

కార్యక్రమంలో గీతం అధ్యక్షులు ఎమ్.శ్రీభరత్ ,ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ కె.గంగాధరరావు, గీతం విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ, ప్రొ వైస్-ఛాన్సలర్‌లు ప్రొఫెసర్ ఎన్.శివప్రసాద్, ప్రొఫెసర్ పి.వి.శివపుల్లయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ, యుజిసి వ్యవహారాల డైరక్టర్ ప్రొఫెసర్ సిహెచ్.రామకృష్ణ, గీతం కార్యదర్శి బి.వి.మోహన్‌రావు, సంయుక్త కార్యదర్శి ఎమ్.భరద్వజ్, కోశాధికారి బి.ఎస్.ఎస్.ఎన్.రాజు, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు మరియు విశాఖ యంపీ ఎంవివి సత్యనారాయణ, శ్రీకాకుళం యంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్సీలు పివిఎన్ మాధవ్, దువ్వారపు రామారావు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నం : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 39వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం అత్యంత వైభవంగా ప్రముఖుల సమక్షంలో నిర్వహించారు. గీతం వైద్య కళాశాలలోని యల్లాప్రగడ సుబ్బారావు ఆడిటోరియంలో జరిగిన వ్యవస్థాపక దినోత్సవంలో భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న అవార్డు గ్రహీత ప్రణబ్‌ముఖర్జీకి గీతం ఫౌండేషన్ అవార్డుతో పాటు రూ. 10 లక్షల నగదు బహుమతిని ప్రశంసా పత్రాన్ని గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ అందచేశారు. ఈ సందర్భంగా ప్రణబ్‌ముఖర్జీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలు దేశ అభివృద్ధికి దోహదపడేలా నైపుణ్యం గల మానవ వనరులును తయారు చేయాలని పిలుపునిచ్చారు.

గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ మాట్లాడుతూ విద్యార్థులను పరిశ్రమలు స్థాపించే వారిగా తీర్చిదిద్దాలన్నది తమ లక్ష్యం అని, ప్రపంచ ర్యాంకింగ్‌లో గీతం స్థానం సంపాదించే దిశగా ప్రణాళికలు రూపొందించామన్నారు.

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి లభిస్తోందని, ఉన్నతవిద్యా రంగంలో అత్యున్నత ప్రమాణాలు పాటిస్తున్నందుకు గాను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి 'అటానమీ' (స్వయం ప్రతిపత్తి) హోదాను కల్పించిందని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ వెల్లడించారు. అటానమీ హోదాతో పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా కొత్త తరం నైపుణ్యతతో కూడిన కోర్సులను ప్రారంభించటం, విదేశీ విశ్వవిద్యాలయాలయు చెందిన నిపుణులైన ఫ్యాకల్టీ సభ్యులను నియమించుకోవడం, విదేశీ విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తామని గీతం వైస్ ఛాన్సలర్ ఈ సందర్భంగా ప్రకటించారు.

కార్యక్రమంలో భాగంగా విశ్వవిద్యాలయంలో ఉత్తమ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి ముఖ్యఅతిధి అవార్డులు అందజేశారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌కు చెందిన డాక్టర్ అనిమా సునీల్ దదిచి, గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన డాక్టర్ ఎస్.రాజా, డాక్టర్ కె.మంజునాధాచారి, కె.విశ్వనాథ్ చైతన్య ఉత్తమ అధ్యాపకులుగా అవార్డు అందుకోగా, భోదనేతర సిబ్బందిలో సీనియర్ అసిస్టెంట్ పాము.వి.వి.ఎస్.ఎన్.మూర్తి, కె.వేణుగోపాలరావు, బి.ఎర్నమ్మ, జి.వెంకటరావులకు ఉత్తమ ఉద్యోగులుగా అవార్డులు అందుకున్నారు. గీతం వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన బెస్ట్ స్పీకర్ అవార్డు పోటీలలో విజేతలుగా నిలిచిన గీతం విద్యార్థులు అసీమాదాస్, సాయివెంకట నితిన్, డి.స్నిగ్ధ, లకు ముఖ్యఅతిధి నగదు బహుమతులు అందజేశారు.

వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్క ృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. జాతీయతా భావాన్ని ప్రభోదించే వివిధ బృందగానాలతో పాటు శాస్త్రీయ సంగీతాన్ని విద్యార్థులు వీనుల విందుగా వినిపించారు.వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు తమ తమ ప్రాంత సంస్కృతిని ప్రతిబింబించే వస్త్ర ధారణతో వారి రాష్ట్ర భాషలో స్వాగతం పలకడం విశేషంగా అకట్టుకుంది. అలాగే ఇతర దేశాల విద్యార్థులు సహితం ముఖ్య అతిధికి ప్రణబ్ ముఖర్జీకి ఆహ్వానం పలికారు.



విశాఖ విమానాశ్రయంలో భారతరత్న ప్రణబ్ ముఖర్జీకి ఘనస్వాగతం







## అధ్యక్షుడి ఎన్నిక కోసం సీడబ్ల్యూసీ భేటీ




దిల్లీ: కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) సమావేశం శనివారం ప్రారంభమైంది. పార్టీ కార్యాలయంలో జరుగుతున్న ఈ సమావేశానికి సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మన్మోహన్ సింగ్, ఏకే ఆంటోనీ, కేసీ వేణుగోపాల్, జ్యోతిరాదిత్య సింధియా, రణ్‌దీప్ సుర్జేవాలా తదితర సీనియర్ నేతలు హాజరయ్యారు.

ఈ భేటీలో కాంగ్రెస్ కొత్త అధ్యక్షుడిని ఎన్నుకునే అవకాశాలు కన్పిస్తున్నాయి. అధ్యక్ష పదవికి సీనియర్ నేతలు ముకుల్ వాస్నిక్, మల్లికార్జున్ ఖర్గే పేర్లు జోరుగా వినిపిస్తున్నాయి. తొలుత తాత్కాలిక ప్రాతిపదికన అధ్యక్షుడిని ఎన్నుకుని, ఆ తర్వాత ఆయన ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించి పూర్తిస్థాయి అధ్యక్షుడిని ఎన్నుకుంటారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే అధ్యక్ష పదవికి అంతర్గత ఎన్నికలు నిర్వహించేందుకు కొందరు సీనియర్లు సుముఖంగా లేరని తెలుస్తోంది.

ఇదిలా ఉండగా.. అధ్యక్షుడి ఎన్నికపై విస్తృత స్థాయిలో చర్చలు జరగాలని రాహుల్ గాంధీ అభిప్రాయపడుతున్నారట. రాష్ట్ర స్థాయిలో సీఎల్పీ నేతలతో సంప్రదించిన తర్వాత సారథిని ఎన్నుకోవాలని ఆయన పార్టీకి సూచించినట్లు సమాచారం. రాష్ట్ర స్థాయి నేతలతో చర్చలు జరిపేందుకు తూర్పు రీజియర్, పశ్చిమ రీజియన్, ఉత్తర, దక్షిణ, ఈశాన్య రీజియన్ నేతలతో ఐదు బృందాలు ఏర్పాడ్డాయి. ఏదేమైనా ఏళ్ల ఘన చరిత్ర కలిగిన హస్తం పార్టీని నడిపించేదెవరో మరి కొద్ది గంటల్లో తేలనుంది.

## ఉత్తరాంధ్ర పాలనలో యాత శెట్టిబలిజలది అత్యంత దయనీయ స్థితి

బిహెచ్‌పివిః ఉత్తరాంధ్ర యాత శెట్టి బలిజ సంక్షేమ సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షులు పిల్లి నూకరాజు శనివారం అనకాపల్లి ఎమ్మెల్యే గుడివాడ అమర్నాథ్‌ని వారి స్వగృహంలో కలిసి ఉత్తరాంధ్ర ప్రాంతంలో అత్యంత వెనుకబడిన దయనీయమైన స్థితిలో ఉన్న యాత కులాన్ని సాంఘికంగా ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మరియు వారి సమస్యలు పరిష్కరించేందుకు యాత కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు సహాయం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఉన్న 10 లక్షల పైచిలుకు జనాభా కలిగిన యాత కులస్తుల సమస్యలు వివరించాలని విజ్ఞప్తి చేశారు.



ఈ సందర్భంగా అనకాపల్లి ఎమ్మెల్యేగా గెలుపొందిన గుడివాడ అమర్నాథ్‌కి ఉత్తరాంధ్ర యాత శెట్టి బలిజ సంక్షేమ సాంస్కృతిక సేవా సంఘం తరుపున యాత జాతి తరఫున పిల్లి నూకరాజు శాలువాతో సత్కరించి మెమెంటో బహుకరించారు.

ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు గుడ్డు కన్నారావు, వనం హనుమంతరావు, సంపంగి ఈశ్వరరావు, వడిసెల రాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యాశాఖపై సీఎం జగన్ సమీక్ష



అమరావతి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం విద్యాశాఖపై సమీక్ష నిర్వహించారు. క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలను మార్చడంపై విద్యాశాఖ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. తొలివిడతలో 12,918 ప్రాథమిక పాఠశాలలు, 3,832 హైస్కూళ్ల రూపురేఖలు మార్చాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. టాయిలెట్లు, ఫ్యాన్లు, లైట్లు, తాగునీరు, నీళ్లు, ఫర్నిచర్, పెయింటింగ్స్, తరగతి గదులకు మరమ్మతులు, బ్లాక్‌బోర్డ్స్ కార్యక్రమాలతో పాటు అదనపు తరగతి గదులను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి తరగతికి తప్పనిసరిగా ఒక టీచర్ ఉండాలని, విద్యార్థుల సంఖ్యకు తగినట్టుగా టీచర్లను నియమించాలని సీఎం జగన్ నిర్ణయించారు.

## వైకాపా అభివృద్ధి పనులపై బురద జల్లవద్దు



అమరావతి : ఆశా వర్కర్లకు సంబంధించి చంద్రబాబు చేసిన ట్వీట్‌పై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే అంబటి రాంబాబు మండిపడ్డారు. చంద్రబాబు అబద్దాలు ప్రచారాలు చేస్తే ప్రజలు నమ్మరని, ఇంతవరకు చేసిన అబద్ధపు ప్రచారాల వల్లే టీడీపీకి 23 సీట్లు వచ్చాయని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను మెచ్చుకోకున్నా ఫర్వాలేదు గానీ.. ప్రభుత్వంపై అనవసరంగా బురద చల్లవద్దని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ దేశంలో చంద్రబాబులా మాట్లాడితే మెంటల్ ఆసుపత్రిలో వేస్తారని స్విట్జర్లాండ్ మంత్రి ఎప్పుడో చెప్పారని గుర్తు చేశారు. కాగా 2011లో వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొందని, ఎన్నో కష్టాలను ఓర్చుకున్న యోధుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు 23 మందిని కొనుగోలు చేసి వైఎస్సార్ సీపీని లేకుండా అంతం చేస్తానని బెదిరించారన్నారు.

## నేను జనసేనతోనే..!

- పార్టీ మారే ప్రసక్తే లేదు
- బిజెపీలో చేరుతున్నానన్నది పుకారు మాత్రమే
- మాజీ జేడీ లక్ష్మీనారాయణ

అమరావతి: జనసేన కీలక నేత మాజీ జేడీ లక్ష్మీ నారాయణ పార్టీని విడుతున్నారని పెద్ద ఎత్తున వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. గత కొన్ని రోజులుగా మాజీ జేడీ బీజేపీ తీర్థం పుచ్చుకోబోతున్నారని వార్తలు వినవచ్చాయి. అయితే తాజాగా ఈ వ్యవహారంపై సోషల్ మీడియా వేదికగా లక్ష్మీనారాయణ క్లారిటీ ఇచ్చేశారు.

మాజీ జేడీ ట్వీట్ సారాంశం..

నా గురించి వస్తున్న ఈ పుకార్లను విని షాకయ్యాను. ద్వేషించే వాళ్లు పుకార్లు పుట్టిస్తే.. వాటిని మూర్ఖులు ప్రచారం చేస్తారు. వీటిని ఇడియట్స్ మాత్రమే అంగీరిస్తారు. వీటిలో ఏ కేటగిరికి చెందిన వారో మీరే నిర్ణయించుకోండి అని మాజీ జేడీ తనపై పుకార్లు పుట్టిస్తున్న వారికి స్ట్రాంగ్ కౌంటరిచ్చారు.

నేను జనసేనతోనే..!

నేను జనసేనతోనే నడుస్తాను. నా అవసరం పార్టీకి ఉంటుందని అధ్యక్షుడు భావించే వరకు జనసేనలోనే ఉంటాను. పుకార్లను పుట్టించడం మాని.. వరద ప్రభావిత ప్రాంతాల్లో సేవలందించడం, మొక్కలు నాటడం, యువతను చైతన్యపరచడం లాంటి కార్యక్రమాలపై దృష్టి పెడితే మంచిది.. జైహింద్ అని లక్ష్మీ నారాయణ తన ట్విట్టర్‌లో రాసుకొచ్చారు. మొత్తానికి చూస్తే తనపై వస్తున్న పుకార్లకు మాజీ జేడీ క్లారిటీ ఇచ్చేశారు. కాగా 2019 ఎన్నికల్లో జనసేన తరపున లక్ష్మీనారాయణ విశాఖ నుంచి ఎంపీగా పోటీచేసి ఓడిన సంగతి తెలిసిందే.








Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com